
J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 13 01.9.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## 'చంద్రయాన్' సక్సెస్...
# ఇక 'సూర్యయాన్'



### సెప్టెంబరు 2న నింగిలోకి.. పిఎస్ఎల్‌వి-సి57
### 'ఆదిత్య - ఎల్1' ఉపగ్రహంతో సహా.. అన్నీ సిద్ధం

ఇటీవలే చంద్రయాన్-3 ప్రయోగం దిగ్విజయమైన ఉత్సాహంతో ఇస్రో (భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ) శాస్త్రవేత్తలు అదే స్ఫూర్తితో అంతరిక్షంలో మరో అద్భుతమైన ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఎప్పుడెప్పుడా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న సూర్యయాన్ ప్రయోగానికి సమాయత్తమయ్యారు. భగభగ మండే భానుని రహస్యాలను తెలుసుకునేందుకు ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని సిద్ధం చేశారు.

12లో

# కమలం చేతిలో... సైకిల్ భవిష్యత్తు

- పొత్తు కోసం బాబు కసరత్తు
- కలవకపోతే కలబడడం కష్టమంటున్న జనసేనాని
- ఆ ముగ్గురూ కలిస్తే తమకే మేలంటున్న వైసీపీ

తెలంగాణలో ఎన్నికల హడావుడి క్రమేణా ఊపందుకుంటోంది. ఇప్పటికే భారాస అభ్యర్థుల చిట్టా ప్రకటించేసి అసంతృప్తులు, అలకలు తీర్చే పనిలో తలమునకలై ఉంది. భాజపా, కాంగ్రెస్ కూడా నేడో రేపో తమ పార్టీల తరపున బరిలో ఉండబోయేవారి లిస్టు ప్రకటించడానికి సిద్ధమవుతున్నాయి. ఇక అధికారికంగా ఎన్నికల ప్రకటన మాత్రమే వెలువడవలసి ఉంది. ఇదే తరుణంలో ఆంధ్రలో కూడా పార్టీలు, నాయకులు, విశ్లేషకులలో ఎలక్షన్ మూడ్ కనిపిస్తోంది. ఎన్నికలకి ఇంకా ఆరు నెలలకిపైగా గడువున్నప్పటికీ, ఇప్పటినుండే చర్చలు, సంప్రదింపులు, ఊహాగానాలు కొనసాగుతున్నాయి. గత ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై గెలిచిన 150(జగన్ కాకుండా) మంది శాసనసభ్యులలో ఎంతమంది ఈసారి బరిలో ఉంటారు? బీజేపీ, టీడీపీ, జనసేన ఎవరికి వారే పోటీ చేస్తారా..? లేక పొత్తులు పొడుస్తాయా...?? రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది ఎవరు ...??? ప్రజలు ఎవరివైపు ఉన్నారు....???? రాజకీయాలు ఆసక్తి ఉన్న ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ.

జనసేన ఇప్పటికే బీజేపీతో దోస్తీ చేస్తోంది. అయితే, తాను బీజేపీతో కలిసి పోటీచేస్తే తనకు లాభం కన్నా నష్టమే ఎక్కువ జరగొచ్చున్న ఆలోచనలో జనసేనాని ఉన్నట్లు ఆ పార్టీ శ్రేణుల సమాచారం. ఎలాగైనా బాబుని బీజేపీకి దగ్గరచేసి ముగ్గురూ కలిసి జగన్‌పై పోరాడాలన్నది ఆయన వ్యూహం అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. చంద్రబాబు కూడా బీజేపీతో పొత్తుకే ఉబలాటపడుతున్నట్లు సమాచారం. గతానుభవాల దృష్ట్యా ఈసారి జనసేన, బీజేపీలతో కలిసి ఎన్నికల బరిలో దిగాలని బాబు భావిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఏపీ బీజేపీ బలమెంత...?

రాష్ట్రంలో 2019 ఎన్నికల ప్రకారం బీజేపీకి ఉన్న ఓట్ల శాతాన్ని గమనిస్తే... 1 శాతం కంటే తక్కువే. ఆ పార్టీతో పొత్తు వల్ల టీడీపీకి వచ్చే అదనపు ఓట్లు ఆ పార్టీకి అధికారాన్ని కట్టబెడతాయన్నది సందేహమే. మరెందుకు బీజేపీతో పొత్తు కోసం టీడీపీ తహతహలాడుతోంది. ఓట్లకు మించిన ఉపయోగం ఏదైనా ఉందా? అని గమనిస్తే.... ఎన్నికలు జరిగే తీరు, ఎన్నికల సమయంలో

10లో

## ఎక్కడున్నావు .. 'రాజన్నా'



సెప్టెంబర్ 02, 2023, 14వ వర్ధంతి సందర్భంగా..

మహానేత స్మృతిలో..

వై.యస్. సేవాసమితి, నెల్లూరు.





## వింజమూరు చెన్నకేశవస్వామికి..

# యల్లాల కుటుంబీకుల వెండి కలశం

శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇటీవల వింజమూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామికి వింజమూరులోని నడుమూరికి చెందిన యల్లాల కుటుంబీకులు అష్టలక్ష్మిలతో కూడిన 50 వేల రూపాయల విలువైన వెండి కలశాన్ని స్వామివారి నిత్యపూజలకు, అభిషేకాల నిర్వహణకు బహుకరించారు. చెన్నకేశవస్వామి దేవాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాతలు యల్లాల వెంకటరామిరెడ్డి, మంజుల, పద్మావతి, రిత్విక, పునీత్‌రెడ్డి మరియు దేవస్థానం ధర్మకర్తలు గణపం రమణారెడ్డి , గణపం సుదర్శన్‌రెడ్డి, ఆలయ ప్రధాన పూజారి సుబ్బనాచార్యులు తదితరులు పాల్గొన్నారు. దాతలైన యల్లాల కుటుంబీకులు గతంలో కూడా స్వామివారికి వెండి కిరీటాన్ని, మూడు వెండి కాసుల హారాలను సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు.

# విద్యుత్‌బిల్లుల పేరుతో..ఆన్‌లైన్‌లో మోసాలు

## వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలంటున్న ఎస్ఇ వెంకటశేషయ్య

విద్యుత్ బిల్లుల పేరుతో ఆన్‌లైన్‌లో కొందరు ముఠాలుగా ఏర్పడి వినియోగదారులను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఉమ్మడి నెల్లూరుజిల్లాలో అలాంటి మోసాలు పెరిగి పోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ బి.వెంకట సుబ్బయ్య కోరారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్ కార్యాలయంలో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. మీ కరెంటు బిల్లులు బకాయిలున్నా యని, వెంటనే చెల్లించకుంటే కరెంట్ కట్ చేస్తామని వినియోగదారులను బెదిరిస్తూ ఆన్‌లైన్‌లో ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారని, వాటిని నమ్మవద్దని ఆయన తెలిపారు. అంతేకాక తమకు సంబంధించిన ఎవరో ఒక వ్యక్తి ఫోన్ నంబరును ఇచ్చి, ఏదైనా అనుమానాలుంటే ఆ వ్యక్తి నంబరుకు ఫోన్ చేయాలని వినియోగదారులకు చెప్తున్నారని, ఆ వ్యక్తికి ఫోన్‌చేస్తే 'నేను విద్యుత్‌శాఖ అధికారినని.. మీరేమీ భయపడాల్సిన అవసరం లేదు..నేనొక ఆన్‌లైన్ లింక్‌ను పంపిస్తా, దానిలో డబ్బులు కట్టేయండి సరిపోతుంది'..అని చెప్తాడని..అలా మోసపు మాటలు చెప్పి వినియోగదారుల వద్ద డబ్బు దోచుకుంటున్నారని, తస్మాత్ జాగ్రత్త అనీ ఆయన హెచ్చరించారు. గూగుల్ పే లేదా పేటీఎంల ద్వారా డబ్బు చెల్లించాలంటూ ప్రజలను దగాచేస్తున్నారని, ప్రజలు ఆ మోసపూరిత మాటలను, లేదా మెసేజ్‌లను నమ్మవద్దన్నారు. అనధికారికంగా వచ్చే ఆన్‌లైన్ లింక్‌లు అసలు ఓపన్ చేయొద్దని ఆయన సూచించారు. ఏవైనా సందేహాలుంటే నేరుగా విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

# వెంకటగిరిలో 8న జాబ్‌మేళా

తిరుపతి జిల్లా వెంకటగిరిలో సెప్టెంబరు 8వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# మాతృభాష మహోన్నతమైనది



మాతృభాష మహోన్నతమైనదని, తల్లిని గౌరవించడం ఎంత గొప్ప సంప్రదాయమో, మాతృభాషను అభిమానించడం కూడా అంతే గొప్పదని పలువురు సాహితీవేత్తలు అభివర్ణించారు. ఆగస్టు 29న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు డా.గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ, వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు రామమూర్తి పంతులు చేసిన కృషిని వివరించారు. ప్రముఖ కవి, అరసం గౌరవాధ్యక్షులు పెరుగు రామకృష్ణ తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. వరంగల్లు కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు, బహుగ్రంథకర్త..నెల్లూరీయులైన గుంజి వెంకటరత్నం రచించిన 'నీతిపద్య రత్నావళి' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వాళ్ళిద్దరనీ ఎవరూ నమ్మరు

## చంద్రబాబు, పవన్‌లవి నాటకాలేనన్న ప్రసన్న



రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరకు వస్తుండడంతో దిక్కుతోచని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు రకరకాల నాటకాలేస్తున్నారని, అయినా ప్రజలెవరూ వాళ్ళిద్దరినీ నమ్మరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. ఆగస్టు 28న ఆయన కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 19వ వార్డు వవ్వేరులో కొత్తగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. బాబు రాసిచ్చింది చదవడం తప్ప పవన్‌కల్యాణ్‌కు తెలిసిందేమీ లేదని, ముఖ్యమంత్రిని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు తప్ప జగన్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూడడం లేదన్నారు. ఎవరెన్నినుకున్నా ప్రజల ఆదరణ జగన్ మోహన్‌రెడ్డికే ఉందన్నారు. బుచ్చి-వవ్వేరు రోడ్డుకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక నిధుల నుంచి 80 లక్షల రూపాయలు మంజూరుచేశారని గుర్తుచేశారు. రూ.21.80 లక్షలతో వవ్వేరులో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించడం జరిగిందన్నారు. బుచ్చి నగరపంచాయతీ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్‌ఛైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత, నాయకులు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి అమ్మవారికి

# ప్రత్యేక పూజలు



ఆగస్టు 25.. రెండవ శ్రావణ శుక్రవారం రోజున నెల్లూరులోని దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలో ఉన్న అవధూత దత్తపీఠం శాఖ శ్రీకృష్ణ యోగ మందిరం ప్రాంగణంలో కొలువైవున్న శ్రీ అష్టలక్ష్మీదేవి అమ్మవారి మందిరంలో శ్రీస్వర్ణ మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌కు అత్యంత వైభవంగా పూజలు, అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కూడా అభిషేక సేవ జరిపారు. ఆ తర్వాత నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలకు ఆలయ ట్రస్టీ అనపల్లి అశోక్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పచ్చిపాల ప్రమీలమ్మ, రేబాల పట్టాభి రామిరెడ్డి, అనపల్లి మస్తానారెడ్డి, రాజశేఖర్, ప్రవీణ్ కృష్ణా, కొల్లం సురేష్ తదితరులు పర్యవేక్షించారు.

# 19 నుంచి.. వినాయక చవితి వేడుకలు

## గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సన్నాహాలు



సెప్టెంబరు 19 నుంచి 23వ తేది వరకు నెల్లూరు నగరంలో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 19న వినాయకుని విగ్రహాలను నగరంలోని అన్ని కూడళ్ళలో పెద్దఎత్తున ఏర్పాటుచేసి పూజలు ప్రారంభించాలని విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఆమేరకు ఆగస్టు 27న వారు నగరంలోని ఓ కన్వెన్షన్‌హాల్లో సమావేశం నిర్వహించి ఉత్సవాలు ఎలా చేయాలో సమీక్షించుకున్నారు. వినాయకచవితి వేడుకల చివరిరోజున నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువుగట్టు వద్ద ఉన్న గణేశ్‌ఘాట్‌లో, పెన్నాబ్యారేజీ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఉత్సవాల ఏర్పాట్ల విషయంపై సెప్టెంబరు 1వ తేదీన స్థానిక టివిఎస్ కల్యాణసదన్‌లో మరోసారి సమావేశం కావాలని, గణేశ్ మండపాల ఏర్పాటు తదితర విషయాలను జిల్లా కలెక్టర్‌తో కూడా సంప్రదించి ముందస్తుగా తగు అనుమతులు తీసుకోవాలని భావిస్తున్నట్లు ఉత్సవసమితి నిర్వాహకులు తెలిపారు. గణేశ్ ఉత్సవ సమితి గౌరవ సలహాదారు ఆనం రంగమయూర్ రెడ్డి, అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, కోశాధికారి మోహన్‌రావుతో పాటు నీలి రాఘవ, కొణిదెల సుధీర్, పాతపాటి అశోక్, వంశీధర్‌రెడ్డి, చేజర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

## - జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా.ఎం.శర్వాణి





నేత్రదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ నేత్రదానం విశిష్టతను అవగాహన చేసుకుని ప్రోత్సహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. ఎం.శర్వాణి పిలుపునిచ్చారు. 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 28న నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో జరిగిన నేత్రదాన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చని, మరణించిన వ్యక్తుల నుంచి మాత్రమే నేత్రాలను స్వీకరించడం జరుగుతుందని, నేత్రదానమంటే మొత్తం కన్నునంతా కాకుండా కంటి పైనున్న కార్నియాను మాత్రమే సేకరిస్తారని ఆమె తెలిపారు. మనం మరణించినా మరొకరికి కంటి చూపును ప్రసాదించే నేత్రదానాన్ని అందరూ ఒక కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రబాబు, జిల్లా కార్యదర్శి షేక్ బాబు, ప్రధాన కార్యదర్శి రోజారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి, డాక్టర్ ఆర్ విజయ భాస్కర్, విమల, సోను, హుస్సేన్‌బీ, నేత్రదాన కౌన్సిలర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.




# క్రమశిక్షణకి మారుపేరు జే.వీ.రెడ్డి

## 3వ వర్ధంతి కార్యక్రమంలో స్మరించుకున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

నైతిక విలువలకు, క్రమశిక్షణకు, నిబద్ధతకి మారుపేరు కీర్తిశేషులు జే.వీ.రెడ్డి అని రాజ్యసభ సభ్యులు 'సేవా భూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు.

శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో ఆగస్టు 31వతేదీ గురువారం ఉదయం జరిగిన జే.వీ.రెడ్డి 3వ వర్ధంతి సభలో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. నిబద్ధత కలిగిన వ్యాపారవేత్తగా, నైతిక విలువలు కలిగిన సంఘసేవకుడిగా, క్రమశిక్షణ కలిగిన విద్యావేత్తగా జే.వీ.రెడ్డి ఖ్యాతి గడించారని ప్రభాకరరెడ్డి అన్నారు. శ్రీ కస్తూరిదేవి విద్యాలయ సంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్‌గా అంకిత భావంతో జే.వీ.రెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా వీపీఆర్ గుర్తు చేసుకున్నారు.

తమ శ్రీమతి ప్రశాంతిరెడ్డితో కలిసి జే.వీ.రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం నిర్వాహకుడు ప్రత్తి శ్రీనివాసులు (ప్రత్తి సూరి కుమారుడు) ఆధ్వర్యంలో శ్రీ కస్తూరిదేవి విద్యాలయ విద్యార్థినులు, సిబ్బందికి వీపీఆర్ దంపతుల చేతులమీదుగా అన్న ప్రసాద వితరణ జరిగింది. జే.వీ.రెడ్డి కుటుంబ సభ్యులు, ఆయన వల్ల లబ్ధిపొందిన వాళ్ళు ఆయనను మర్చిపోయినా, ప్రత్తి శీనయ్య మాత్రం తనకు జీవనోపాధి చూపించిన తమ పెద్దాయనను గుర్తుపెట్టుకుని ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి జే.వీ.రెడ్డి ఋణం తీర్చుకుంటున్నాడు.




అన్న ప్రసాద వితరణ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు

## ప్రతి పేదవానికీ...
# సంక్షేమ పథకాలు అందాలి

- జడ్పీ సమావేశంలో ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత చేరువ చేయడానికి అందరూ కృషిచేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఆగస్టు 30న నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అపరిష్కృతంగా వున్న సమస్యలను పరిష్కరించేందుకు దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె 4 అంశాలను సమావేశం ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. జిల్లాలోని 46 మండలాల పరిషత్ కార్యాలయాల్లో జడ్పీటిసి సభ్యులకు ప్రత్యేకంగా ఒక గదిని నిర్మించాలని, ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక పుస్తకాన్ని పంపిణీ చేయాలని, నెల్లూరు నగరంలోని పాత జిల్లా పరిషత్ కార్యాలయాన్ని తొలగించి ఆ స్థలంలో కమర్షియల్ భవనాన్ని నిర్మించాలని, నూతన జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో అతిథి గృహాన్ని నిర్మించాలని ఆమె ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనలను జడ్పీ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జిల్లా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు జిల్లాను అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాఖీ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జడ్పీ ఛైర్మెన్ ఆనం అరుణమ్మ రాఖీ కట్టి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధునాతన వైద్యం..
# గ్రామీణులకు అందుబాటులో ఉండాలి

- కేర్ ఆసుపత్రి వర్క్‌షాప్‌లో వైద్యులకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య సూచన

అధునాతన వైద్యం గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామీణుల పట్ల అందరూ సానుభూతి ధోరణితో వ్యవహరించి వారి బాగుకు బాటలు వేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఆగస్టు 27న ఆయన హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రిలో 8వ అంతర్జాతీయ రైనో ప్లాస్టీ వర్క్‌షాప్‌ను, ఆ ఆసుపత్రి ఇఎన్‌టి ఫేషియల్ ప్లాస్టిక్ సర్జరీల విభాగాధిపతి డాక్టర్ విష్ణుస్వరూప్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, కాలానుగుణంగా ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనేందుకు వైద్యవృత్తిలోని వారు అధ్యయనం, ఆవిష్కరణ, శిక్షణ అనే అంశాలతో రాణించాలని సూచించారు. ఆ దిశగా ఫేషియల్ రీకన్‌స్ట్రక్టివ్ అండ్ కాస్మొటిక్ సర్జరీ ఇండియా ట్రస్ట్ వారు చొరవ తీసుకుని వైద్యులకు నిరంతరం శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. ముఖానికి, లేదా ముక్కుకు ఏదైనా దెబ్బతగిలినప్పుడు ముఖకవళికలు మారిపోతుంటాయని, అలాంటి వాటిని సరిచేయడానికి ప్లాస్టిక్ సర్జరీ అవసరమవుతుందని కేర్ ఆసుపత్రి ఇఎన్‌టి ఫేషియల్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ విష్ణుస్వరూప్‌రెడ్డి తెలిపారు. అధునాతనమైన రైనోప్లాస్టీ, ఫేషియల్ ప్లాస్టిక్ సర్జరీలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని, ముఖ పక్షవాతం, గ్రహణ మొర్రి వల్ల పెదవుల మధ్య చీలిక ఏర్పడుతుందని, అలాంటి అనేక రకాల సమస్యలను ఫేషియల్ ప్లాస్టిక్ సర్జరీతో సరిచేసుకోవచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది ఇఎన్‌టి డాక్టర్లు పాల్గొన్నారు.



# 'బండ' భారం..కొంత తగ్గింది

## రూ. 2 వందలు తగ్గిన గ్యాస్ ధర



నిత్యావసరాల ధరలు ఆకాశంలో విహరిస్తూ, పప్పులు ఉప్పులు చివరికి కూరగాయలు ధరలు కూడా సామాన్యులకు దొరక్కుండా చుక్కల్లోకంలో చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు గ్యాస్ బండ భారం కొంత తగ్గింది. వంట గ్యాస్ సిలిండర్ ధరను 200 రూపాయలు తగ్గించాలని తాజాగా కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఈ మండే ధరల్లో కాస్తంత ఉపశమనం కలిగించింది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆగస్టు 29న ఢిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆ మేరకు నిర్ణయం తీసుకోవడం, ఆ తగ్గింపు కూడా వెంటనే అమల్లోకి రావాలని చెప్పడం మంచిదే. దీనివల్ల దేశవ్యాప్తంగా దాదాపు 33 కోట్ల మంది గ్యాస్ వినియోగదారులకు ఈ తగ్గింపు వర్తిస్తుంది. అదేవిధంగా ఉజ్వల పథకం కింద 75 లక్షల మంది మహిళలకు ఉచితంగా గ్యాస్ ఇవ్వాలని నిర్ణయించడం పేదప్రజానీకంలో సంతోషం కలిగిస్తోంది. 'రక్షాబంధన్' పండుగ సందర్భంగా ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్నందుకు జనం ఆనందిస్తున్నారు. ఈ తగ్గింపు వల్ల 2023–24 సంవత్సరంలో కేంద్రప్రభుత్వంపై సుమారు 7680 కోట్ల రూపాయల దాకా భారం పడుతుందని అంచనా. త్వరలోనే మరో అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో తాము అధికారంలోకి వస్తే వంటగ్యాస్ ధరల భారం తగ్గిస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటుంటే, అంత దాకా ఎందుకు..తాము ఇప్పుడే ఆ ధరలు తగ్గిస్తామంటూ కేంద్రప్రభుత్వం అందుకు ధీటుగా గ్యాస్ ధరలు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్లుందని విపక్షాల భావన. అయితే, ఈ ధర తగ్గింపు విషయంలో ప్రజాసంక్షేమమే పరమావధి తప్ప, ఇందులో ఎలాంటి రాజకీయాలూ లేవని అధికారపక్షాల వారంటున్నారు. ఏదేమైనా, ప్రజలపై గ్యాస్ బండ భారం ఇప్పటికైనా కొంత తగ్గినందుకు అందరికీ సంతోషమే మరి!...

# డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్తగా ప్రవేశపెట్టనున్న కార్డు ప్రైమ్ విధానానికి నిరసనగా జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు ఆగస్టు 30న పెన్‌డౌన్ చేపట్టారు. నెల్లూరులోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ నిరసనలో డాక్యుమెంట్ రైటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు మాట్లాడుతూ, కార్డుప్రైమ్ విధానంతో ప్రజల ఆస్తులకు భద్రత లేకపోవడమే కాక, తమ జీవనభృతికి కూడా ఇబ్బంది కలుగుతుందని, ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# 'రత్నం' విద్యార్థినులను అభినందించిన.. జిల్లా ఎస్పీ

నెల్లూరులోని డా.కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థినులు నిఖిల, మాధురిసింగ్‌లను ఆగస్టు 30న జిల్లా ఎస్పీ డా. కె తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు. తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఖేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ సిలాట్ లీగ్'లో ఆ విద్యార్థినులు జాతీయస్థాయిలో రజత, కాంస్య పతకాలను సాధించారు. విద్యా సంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, పెన్‌కాక్ సిలాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరద్వాజ్, ప్రిన్సిపాల్ మణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు కృష్ణ కిశోర్, వాసంతి కిశోర్‌లు తమ విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.



లాయర్
సెప్టెంబర్ 01, 2023

# భక్తుల భద్రత.. గాలిలో దీపం కాకూడదు

కలియుగ ప్రత్యక్షదైవం.. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుమలేశుని దర్శనం కోసం నిత్యం వేలాదిభక్తులు నడిచివెళ్లే తిరుమల నడకదారిలో ఇటీవల ఓ బాలికను పులి పొట్టన బెట్టుకోవడం ఒక్క ఆంధ్రరాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా పెను సంచలనమైంది. ఈ సంఘటనతో దేశంలో వున్న ఆలయాలలో భక్తుల భద్రత చర్చనీయాంశంగా మారింది. తిరుమల, శ్రీశైలం లాంటివి అటవీ ప్రాంతాలు కాబట్టి అక్కడ క్రూరజంతువులు సంచరిస్తూ అప్పుడప్పుడూ భయపెడుతుంటాయి. అలాంటి పరిస్థితి అన్నిచోట్లా లేకపోయినా, దేశంలో అనేకచోట్ల పలు సందర్భాలలో భక్తుల భద్రత గాలిలో దీపంగా మారిందన్న అభిప్రాయం అన్ని వర్గాలనుండి వ్యక్తమవుతోంది.

భరతభూమి దేవభూమి కాబట్టి భగవంతుని పూజించుకోవడానికి లేదా దర్శించుకోవడానికి దేశంలో అడుగడుగునా అనేక దివ్యమైన పుణ్యక్షేత్రాలున్నాయి. ఒక్క తిరుమలకే కాదు.... శ్రీశైలం, భద్రాచలం, శబరిమలై, కాశీ, రామేశ్వరం, చార్‌ధామ్, అమర్‌నాథ్, గంగోత్రి, అయోధ్య, మానస సరోవర్... ఇలా కన్యాకుమారి నుండి కాశ్మీరం వరకు అనేక పవిత్రప్రాంతాలకు భక్తజనం తండోపతండాలుగా తరలి వెళ్తూనే ఉంటారు. దైవ దర్శనం చేసుకుని తిరిగి ఇల్లు చేరేదాకా మార్గమధ్యంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూనే ఉంటారు. దేశం నలుమూలలా ఉన్న అనేక క్షేత్రాలను దర్శించుకోవాలనే తపనతో భక్తులు నిత్యం లక్షల సంఖ్యలో రైళ్ళల్లో, బస్సుల్లో, విమానాల్లో కూడా ప్రయాణాలు చేస్తుంటారు. తీరా ఆ క్షేత్రాల వద్దకు వెళ్ళేసరికి ఏదో ఒక సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. జనసమూహాల్లో తొక్కిసలాటలు జరగడం, అనుకోని విపత్కర సంఘటనలతో అనేకమంది ప్రాణాలు పోగొట్టుకోవడం మనం తరచూ చూస్తూనే వున్నాం.

ఎంతకాలం ఇలా?..ముఖ్యంగా పన్నెండేళ్ళకి ఒకసారి వచ్చే నదీ పుష్కరాలలోను, ఏటా జరిగే తిరునాళ్ళు, జాతర్లలోనూ, భక్తజనం తండోపతండాలుగా కనిపిస్తుంటారు. పుష్కరాలలో, జాతర్లలో అయితే రాత్రివేళల్లో సైతం లెక్కలేనంతమంది భక్త జనం ఉంటారు. ఒకేసారి లక్షల మంది జనం వస్తే ఎవరు మాత్రం చేసేదేముందీ? అని నిర్లక్ష్యం వహిస్తే ఏం జరుగుతుందో చెప్పడానికి మనకి ఎన్నో గతానుభవాలు చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయి వున్నాయి. నిజానికి లక్షలాది మంది జనానికి ఒకేసారి భద్రత కల్పించాలంటే కష్టతరమే. అలా అని చూసీ చూడనట్లుండడం సముచితం కాదు. ప్రభుత్వాలు, అధికారగణం, ఆయా ఆలయాల ప్రతినిథులు, నాయకులు అందరూకలసి ముందస్తు అంచనాలతో భక్తుల కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిపుణులతో చర్చించి భక్తుల భద్రతకు ఒక ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాల్సి ఉంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఆ రక్షణ చర్యలను విస్తరిస్తూ ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలి. అందుకు ఎక్కడికక్కడ ప్రత్యేక శిక్షణను కూడా ఇవ్వాలి. సముద్ర ప్రాంతాల్లో ఉన్న క్షేత్రాలను దర్శించుకునేవారు సాగరంలో స్నానాదికాలు చేసుకుని దైవదర్శనం చేసుకోవడం ఆనవాయితీ. అలాంటి సందర్భాల్లో సాగరతీరాల వద్ద పెద్దసంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడమే కాక, ప్రమాదాలున్న ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు ఉంచాలి. నదీనదాలున్న ప్రాంతాల్లోనూ భద్రత ఉండాలి. కొండప్రాంతాల్లో జంతువుల బారినపడకుండా భక్తులు వెళ్లే మార్గాల్లో కంచెలు ఏర్పాటుచేయడమో లేదా పోలీసు బందోబస్తును పెంచడమో చేయాలి. ఆలయాలకు భక్తులు సమర్పించే కానుకలు పెద్దమొత్తాల్లోనే ఉంటాయి. వాటిని దేవాలయాల అభివృద్ధికే కాక, అందులో కొంతశాతాన్ని తప్పనిసరిగా భక్తుల రక్షణకు, సౌకర్యాలకు కూడా వెచ్చించేలా ప్రభుత్వాలు మార్గదర్శకాలను నిర్దేశించాలి. అనేకప్రాంతాల్లో భక్తులకు కనీస వసతులుండవు. మంచినీళ్లు దొరకవు, మరుగుదొడ్లు ఉండవు, వాహనాలు నిలిపేందుకు చోటుండదు. వసతికి అవసరమైన గదులుండవు, ఉన్నా వాటిలో వసతులుండవు. అన్నపానీయాలు అసలు అందుబాటులో ఉండవు. పిల్లాపాపలతో వచ్చేవాళ్ళు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. దేశవ్యాప్తంగా ఉన్న పుణ్య క్షేత్రాల ప్రాముఖ్యత పెరుగుతోంది. సామాజిక మాధ్యమాల పుణ్యమా అంటూ వాటికి ప్రచారం లభించి భక్తుల సంఖ్య కూడా ఊహించని స్థాయిలో పెరిగిపోతోంది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వాలు మేల్కొని, కోట్లాది మంది భక్తుల భద్రతకు భరోసా కలిగేవిధంగా శాశ్వతప్రాతిపదికన ఒక సమగ్రమైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి. కేంద్రప్రభుత్వంతో పాటు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు తక్షణం సమాయత్తం కావాలి.

# కనిపించని చంద్రయాన్ సంబరాలు




మొన్న ఆగస్టు 23వ తేదీన, భారతీయ శాస్త్రజ్ఞుల ప్రతిభకు నిదర్శనంగా భరత జాతి గర్వించే స్థాయిలో చంద్రయాన్-3 చంద్రుడిపై అడుగుపెట్టింది. ప్రపంచం మొత్తం ఔరా... అంటూ అవాక్కయ్యే స్థాయిలో మన దేశ అంతరిక్ష పరిశోధనా రంగం చంద్రుడిపై మన జెండా ఎగురవేసింది. అబద్ధపు వాగ్దానాలతో, స్వార్ధపూరిత ప్రయోజనాలతో రాజకీయాలలోకి వచ్చి ప్రజలని పాలించే వారి పుట్టినరోజు, పెళ్లిరోజు, వాళ్లకి పదవి వచ్చిన సందర్భం అంటూ వారి అనుచరులు హడావుడి చేసేస్తారు. రోడ్లపైకి వచ్చి చెవులు చిల్లులుపడేలా బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుతుంటారు. పేజీలు కొద్దీ పత్రికా ప్రకటనలు ఇస్తుంటారు. వేలంవెర్రిగా ఫ్లెక్సీలు కడుతుంటారు. వీధులలోకొచ్చి మిఠాయిలు పంచిపెడుతుంటారు. పాతిక మంది 8 గంటల సేపు ఆడే క్రికెట్ మ్యాచ్ గెలిచినా, లాభాల కోసం నిర్మాతలు తీసే తమ హీరో సినిమా రిలీజై హిట్టైనా ఇదే తంతు. కానీ, చంద్రయాన్ విజయంతమైన రోజు అలాంటి సంబరాలు ఎక్కడా పెద్దగా కనిపించలేదు. చిన్నస్థాయి బాణాసంచా శబ్దం కూడా వినిపించలేదు. భారతీయుల ప్రతిభను యావత్ ప్రపంచం కొనియాడిన అద్భుత ఘట్టం అది. మన దేశంలో పుట్టిన ప్రతిఒక్కరూ రొమ్మువిరుచుకుని గర్వించే సంఘటన అది. అలాంటి అరుదైన సందర్భంలో ఊహించిన స్థాయిలో సంబరాలు కనిపించి, వినిపించకపోవడం బాధాకరం.

వై. కాత్యాయని, బాలాజీనగర్, నెల్లూరు.

## 'సర్వే'జనా సుఖినోభవంతు.. విశ్లేషణ బాగుంది

గత వారం మన 'లాయర్'లో 'మనలో మాట'లో భోగాది విశ్లేషించిన 'సర్వేజనా సుఖినోభవంతు' చాలా అర్ధవంతంగా ఉంది. తమపై, తమ పాలనపై తమకే నమ్మకం లేని ప్రభుత్వాధినేతలు, నాయకులు సర్వేలపై ఆధారపడితే బొక్కబోర్లా పడడం తథ్యం అని చెప్పకనే చెప్పారు రాయుడు. మన 'లాయర్'లో ప్రతివారం రాయుడు చర్చిస్తున్న అంశాల శీర్షిక పేరు 'మనలో మాట' అయినా, నిజానికి ఆయన వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు మాత్రం అందరూ అనుకుంటున్న మాటలే. ప్రజాక్షేత్రంలో అందరూ చర్చించుకుంటున్న విషయాలే. రాయుడికీ, 'లాయర్'కి నా అభినందనలు.

– యు. విశ్వేశ్వరరావు, హైదరాబాదు.

## ఖాళీస్థలాలు కాదు.. మురుగుదిబ్బలు!

నెల్లూరు నగరంలో జనావాసాల మధ్య ఉన్న ఖాళీస్థలాల పట్ల వాటి యజమానులు ఏళ్ల తరబడిగా శ్రద్ధ తీసుకోకపోవడంతో అవి మురుగుదిబ్బలుగా మారుతున్నాయి. చిన్నవానకే బురదగుంటలుగా మారి దోమలకు నిలయాలవుతున్నాయి. ఈ దుస్థితిని ఎన్నిసార్లు చెప్పినా, కార్పొరేషన్ వాళ్లు తరచూ హెచ్చరిస్తూనే ఉన్నా యజమానులు వాటి బాగును పట్టించుకోవడం లేదు. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్నవారు దుర్గంధాన్ని భరించడమే కాక, దోమలు ఈగలతో వ్యాధుల బారిన పడాల్సివస్తోంది. ఇకనైనా ఆ ప్లాట్ల సొంతదారులు కొంత ఖర్చయినా సరే భరించి, వాటిని పరిశుభ్రంగా ఉంచాలని ప్రార్థన.

– జె. ఉమామహేశ్వర్, నెల్లూరు.

"భగవద్గీత మీద ప్రమాణం చేసి అంతా నిజమే చెప్తాను, అబద్ధం చెప్పను".

న్యాయస్థానాల్లో బోనులో నిలబడ్డ సాక్షుల చేత చేయించే ప్రమాణం ఇది. మన పురాణాల్లోకెళితే భగవద్గీతతో సంబంధం లేకుండానే "సత్యపీఠం"పై ఎక్కి నిలబడితే నిజం దానంతట అదే తన్నుకు వచ్చే దృశ్యం మనం 'మాయాబజార్' సినిమాలో కూడా చూశాం. నిజం మాట్లాడాలంటే చాలా ధైర్యం కావాలి. నిజం మాత్రమే మాట్లాడే సత్యహరిశ్చంద్రుడు అన్నీ కష్టాలనే ఎదుర్కొన్నాడు. అప్పటినుండీ ఇప్పటివరకూ సమాజంలో ఎలాంటి మార్పూ లేదు. ఇప్పుడైనా నిజం మాట్లాడితే ఇబ్బందులు తప్పవు. మేము సత్యహరిశ్చంద్రులమని చెప్పం కానీ... కొన్నైనా నిజాలు మాట్లాడాలని ప్రయత్నిస్తున్న వారికి సహకరిస్తున్నాం. నిజాలే కావాలనుకునే వారి కోసం ఈ వారం నుండి 'సత్యపీఠాన్ని' వేదికగా చేసి, వారికే అంకితమిస్తున్నాం. -సం/-




### రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక నేరస్తులకు

## పునరావాస వేదికగా టీటీడీ బోర్డు!

తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టు బోర్డు రాజకీయ నేతలు, కోటీశ్వరులు, ఆర్థిక నేరస్తులకు పునరావాస వేదికగా మారిపోయింది. ఆధ్యాత్మికతత్పరత, దైవభక్తి, సామాజిక స్పృహ, సేవాగుణాలున్న వ్యక్తులు భూతద్దం పెట్టి వెతికినా టీటీడీ బోర్డులో కనిపించడం లేదు. ఇటీవల కాలంలో నేరస్తులకు కూడా టీటీడీలో చోటు కల్పించడం విస్మయాన్ని కలిగిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తాజాగా ఏర్పడ్డ టీటీడీ బోర్డు కూడా ఇదే కోవకు చెందిందే. ఈ నియామకాలలో కూడా స్వచ్ఛత లేదు. రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందినవారికి తప్పితే సామాన్య భక్త జనానికి ఈ నియామకాలలో ప్రాధాన్యత కనిపించలేదు.

నిజమైన దైవభక్తి, ఆధ్యాత్మిక ఆసక్తి కలిగి, తిరుమల తిరుపతి దేవస్థానాల అభివృద్ధి కోసం, భక్తుల సౌలభ్యం కొరకు పాటుపడి తమ సూచనలు, సలహాలతో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టగలిగేవాళ్ళు సమాజంలో చాలామందే ఉన్నారు. ఉదాహరణకి ఎలాంటి అవినీతి మచ్చలేని బాలసుబ్రహ్మణ్యం లాంటి విశ్రాంత ఐఏఎస్ అధికారులు, పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి లాంటి మేధావులు బోలెడుమంది రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నారు. అలాంటివాళ్ళని పక్కనపెట్టి రాజకీయ నిరుద్యోగులకి, తమ ఆర్థిక అవసరాలు తీర్చే అపర కుబేరులకి, నేరారోపణ ఎదుర్కొంటూ జైళ్లకు వెళ్లి బెయిళ్లపై బయట తిరుగుతున్న ఆర్థిక నేరగాళ్లకు టీటీడీలో చోటు కల్పించడం సిగ్గుచేటు. తమ ఆర్థిక అవసరాలు తీర్చుకోవడానికి, రాజకీయంగా తమ అనుయాయులకు గుర్తింపు కల్పించుకోవడానికి పదవుల పంపకం చేయాల్సిందే. కానీ, అందుకోసం ఆధ్యాత్మిక కేంద్రాలను, తిరుమల లాంటి ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను వేదికలుగా మార్చుకోవడం సబబుకాదు. ఆ పని ఏ ప్రభుత్వం చేసినా అది క్షమించరాని పాపమే...!

## జాతీయ అవార్డులకు నటనే కొలమానమా?

తెలుగు సినిమా రంగం వరుసగా సంచలనాలను సృష్టిస్తూ ప్రపంచ సినిమా దృష్టిని ఆకర్షిస్తోంది. చాలా సంతోషం. ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో రాజమౌళి బృందం సాధించిన ఆస్కార్ ఆనందోత్సాహాలు ముగియకముందే, ఇప్పుడు ఆ సినిమాకి జాతీయ అవార్డుల పంట పండింది. ఆ చిత్ర నటీనటుల ప్రావీణ్యానికన్నా సాంకేతిక నైపుణ్యాన్ని, ప్రజాదరణని గుర్తించి అవార్డులు ఇచ్చారు. బ్రిటిష్ పరిపాలనలో వారిపై తిరుగుబాటు చేసిన ఇద్దరు వేర్వేరు యువకుల కథలని ప్రామాణికంగా తీసుకుని దర్శకుడు ఆ చిత్రాన్ని రూపొందించారు. ఉత్తమ చిత్రంగా 'ఉప్పెన' ఎంపిక కావడం కూడా సముచితమే. ప్రేమంటే కేవలం రెండు శరీరాలకి కాదు, రెండు మనసులకు సంబంధించిందన్న చక్కని సందేశాన్ని నేటి యువతకి, వారి అమ్మానాన్నలకి ఇవ్వడంలో దర్శకుడి ప్రతిభ ఆ సినిమాలో కనిపిస్తుంది.

కానీ, 'పుష్ప' సినిమాలో హీరో లాంటి విలన్ పాత్ర పోషించిన అల్లు అర్జున్‌కి అవార్డు ప్రకటించడం విచిత్రంగానూ, విడ్డురంగానూ ఉంది. ఆ సినిమా ఆసాంతం నేరపూరిత ప్రపంచంలోనే నడుస్తుంది. కథ మొత్తం ఎర్రచందనం స్మగ్లింగ్ చుట్టూ తిరుగుతుంది. పేరుకి అల్లు ఆ సినిమాలో హీరో అయినా, పాత్ర / వృత్తిపరంగా విలన్. అనుమానం లేదు. ఆ పాత్రలో ఆ కుర్రవాడి నటన అద్భుతం. ఇదే తరుణంలో ఆ సినిమా సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న అంశాన్ని కూడా అవార్డు కమిటీ పరిగణలోకి తీసుకుని ఉంటే బాగుండేది.

అంతర్జాతీయంగా జరిగే అందాల పోటీలలో సైతం కేవలం పోటీ చేసేవారి అందాన్ని మాత్రమే చూసి విజేతను నిర్ణయించరు. పోటీలో చివరి అంకానికి చేరుకున్న ముగ్గురిని సామాజిక స్పృహ, సేవాతత్పరత తదితర అంశాలపై ప్రశ్నలు అడిగి, వారిని పరిగణలోకి తీసుకుని అంతిమ విజేతను నిర్ణయిస్తారు. అల్లు అర్జున్‌కి అవార్డు ఇవ్వడాన్ని ఎవరూ తప్పు పట్టరు. కానీ, ఆయన నటించిన ఆ పాత్ర సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న అంశానికి కూడా ప్రాధాన్యత ఇచ్చి అవార్డు ప్రకటించి ఉంటే బాగుండేది. సినిమా వృత్తాంతం ప్రభావం సమాజంపై ఎంత స్థాయిలో ఉంటుందో, ఆ సినిమాలో నటించే ప్రధానపాత్ర కూడా సమాజాన్ని అంతే ప్రభావితం చేస్తుంది. ఇది ఎవరూ కాదనలేని వాస్తవం..!

-రాజశ్రీ

# హమ్మయ్య!... ఏళ్ళనాటి కష్టాలకు చెక్!

**దక్షిణమధ్య రైల్వే పరిధిలో అత్యంత పొడవైన రైల్ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓఆర్) అందుబాటులోకి వచ్చింది. వానలు వరదల సమయంలో తరచూ రైళ్ళ రాక పోకలకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, జిల్లాలోని మనుబోలు-గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య నిర్మించిన ఈ వంతెనతో ఇక ఆ కష్టాలన్నీ తీరిపోయినట్లే. ఇటీవలే ఈ వంతెన ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పటిదాకా 40 మీటర్ల పొడవు దాకా ఉన్న వంతెనలే అత్యంత పొడవైనవిగా దక్షిణమధ్య రైల్వే రికార్డుల్లో ఉండగా, ఈ కొత్త వంతెన 2.2 కిలోమీటర్ల అత్యంత పొడవైన వంతెనగా రికార్డు సృష్టించింది. దీంతో తిరుపతికి, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్ళే ప్రయా ణీకుల సమస్యలు కూడా తీరినట్లే!...**

నెల్లూరుజిల్లాలోని మనుబోలు-గూడూరు మధ్య మూడవ రైల్వే లైను ఏర్పాటులో భాగంగా గూడూరు సమీపంలోని పంబలేరు నదిమీద రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్వీఎన్ఎల్) నిర్మించిన అత్యంత పొడవైన రైల్వే ఫ్లైఓవర్ ఇటీవల ప్రారంభం కావడం విశేషం. దీని నిర్మాణానికి రెండేళ్ళ సమయం పట్టింది. దీంతో, ఇక గూడూరు-మనుబోలు మధ్య రైళ్ల రాకపోకలకు సమస్య ఉండదు. సాధారణంగా ఈ ప్రాంతంలో తరచూ వాగులు పొంగుతుండడం వల్ల ఇబ్బందిగా ఉండేది. గతంలో ఈ ప్రాంతంలోని వాగులు వంకలు పొంగినప్పుడు రైల్లైనుపై కూడా నీళ్ళు ప్రవహించడం, పట్టాలు దెబ్బతింటుండడం, రైళ్ళు నిలచిపోతుండడం జరిగిన సందర్భాలున్నాయి. దాదాపు ప్రతిఏటా ఇలాంటి ప్రకృతి విపత్తులతో రైళ్ళ రాకపోకలకు సమస్యగా ఉండేది. అలాంటి సమస్యలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని శాశ్వతప్రాతిపదికపై ఈ అద్భుతమైన వంతెనను రైల్వే శాఖ నిర్మించి ఏళ్ళ తరబడి ఉన్న కష్టాలకు చెక్ పెట్టింది.



- మనుబోలు-గూడూరు మధ్య.. 2.2 కిలోమీటర్ల రైల్వే ఫ్లై ఓవర్
- వాగులు వంకలు పొంగినా ఇక ఇబ్బంది లేదు
- దక్షిణమధ్య రైల్వేలో.. ఇదే అత్యంత పొడవైన వంతెనగా రికార్డు

### దక్షిణమధ్యరైల్వేలో.. ఇది 7వ రైల్వే ఫ్లైఓవర్ :

దక్షిణ మధ్య రైల్వేలో ఈ వంతెన 7వది. మనుబోలు విజయవాడ రైల్వే డివిజన్లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఉంది. రైల్వే జంక్షన్ ఉన్న గూడూరు ఇటీవల జిల్లాల పునర్విభజనలో తిరుపతి జిల్లాలో చేరిపోయింది. ఈ రెండు జిల్లాల మధ్యలో ఉన్న మనుబోలు-గూడూరు మధ్యలో పంబలేరు నది ఒక్కటే కాకుండా, దాదాపు పది కాలు



వల దాకా ఉన్నాయి. వానలు వరదలు వచ్చినప్పుడు ఇవి పొంగి రోడ్లపైనా, రైల్వేట్రాక్పైనా ప్రవహిస్తుం డడంతో వాహనాల రాకపోకలు, రైళ్ళ రాకపోకలు కూడా నిలిచిపోయేవి. ముఖ్యంగా ఆ పరిస్థితుల్లో గూడ్స్ రైళ్లు సకాలంలో చెన్నైకి వెళ్ళలేకపోవడం, వ్యాపారులకు నష్టాలు వస్తుండడంతో, భారీస్థాయిలో రైల్వేశాఖ బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడా సమస్యలన్నిటికీ పరిష్కారం లభించి నట్లయింది. గూడూరు రైల్వే జంక్షన్ కనుక, ఈ ప్రాంతంలో ఈ పొడవైన వంతెన అందుబాటులోకి రావడంతో రైళ్ళ రాకపోకలకు ప్రయాణీకులకు మరింత ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు.

ఏదేమైనా, ఈ జోన్లో సుమారు 2.2 కిలోమీటర్ల దూరం అతి పొడవైన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం జరగడం ఇదే తొలిసారి. ఇది దక్షిణమధ్య రైల్వే లోనే అతిపెద్ద ఫ్లైఓవర్గా నిలవడం ఒకరకంగా ఉభయ జిల్లాల అదృష్టమనే చెప్పాలి. ఈ సింగిల్ లైన్ వంతెన రెండు దిశల్లోనూ రైళ్ల రాకపోకలకు ఉపయోగంగా ఉండేలా రైల్వేశాఖ అధికారులు దీనిని తీర్చిదిద్దడం విశేషం.

### తిరుపతి-చెన్నైలకు ఇక సకాలంలో రైళ్ళు :

ఈ కొత్త రైల్వే ఫ్లైఓవర్ వల్ల గూడూరు రైల్వేస్టేషన్ మీదుగా విజయవాడ నుంచి రేణిగుంట, చెన్నైల మధ్య ఏకకాలంలో నడిచే రైళ్ళ రాకపోకలకు ఇక ఎలాంటి అంతరాయం ఉండదు. చెన్నై-తిరుపతిలకు ఇక సకాలంలోనే రైళ్ళు చేరుకుంటాయి. గూడూరు రైల్వే స్టేషన్ మీదుగా విజయవాడ, రేణిగుంట, చెన్నై సెక్టార్లలో రైళ్ళ రాకపోకలకు ఈ వంతెన మరింతగా ఉపయోగపడుతుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞా నంతో ఈ అద్భుతమైన రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించినవారందరికీ ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్కుమార్ జైన్ ప్రత్యేకంగా అభినందించారు.

---



## డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో..
# సత్తాచాటిన 'కృష్ణచైతన్య'

విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన 5వ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకున్నారు. అన్ని కోర్సులు, గ్రూపులలో ఉత్తమ మార్కులు సాధించి విజయదుందుభి మోగించారు. బిఎస్సీలో షేక్ దుల్షా 99.8 శాతం మార్కులు సాధించి యూనివర్శిటీ టాపర్గా నిలిచిందని కళాశాల డైరెక్టర్లు డా.ఆర్వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్రెడ్డి తెలిపారు. అదేవిధంగా ఏ.సుప్రి, ఎస్డి అన్జుమ్ షైఫా 99.5 శాతం మార్కులు సాధించారని, పి.సుజిత 99.2, ఏ.భార్గవి 99 శాతం, ఏ.పూజిత, పి.రీతిక, ఎస్.మౌనిక, షేక్ మనీషా 98.5శాతం వంతున ఉత్తమ మార్కులతో రాణించారని పేర్కొన్నారు. బీసీఏలో కె.ధరణి ఉషా, కె.రాజామౌనిషాలు 98 శాతం వంతున మార్కులు సాధించి యూనివర్శిటీ టాపర్లుగా నిలిచారన్నారు. ఎస్డి రుబీనా, జి.జాహ్నవి 97శాతం, ఎం ప్రవల్లిక, సిహెచ్ సాయిసూర్య, పి.ప్రసన్న, కె.మౌనిక, పి.మానస, సిహెచ్ వనితాబాయి, ఎన్ నిత్యశ్రీ, డి.సాయిబిందు 96 శాతం వంతున మార్కులు సాధించారని తెలిపారు. బిఎస్సి లైఫ్సైన్స్లో కె.లక్ష్మీప్రసన్న 98 శాతం మార్కులతో యూనివర్శిటీ టాపర్గా నిలిచిందని, ఎస్కె షహనాజ్, పి.లావణ్య, కె. వినయ్కుమార్లు 97 శాతం మార్కులతో ఉత్తమంగా రాణించారన్నారు. బీబీఏలో జి.మౌనిక 94శాతం మార్కులతో యూనివర్శిటీ టాపర్గా తన ప్రతిభ చాటుకుందని, ఎం. శ్రీలేఖ్య 93శాతం, కె.సోని-ఎన్.హర్షితలు 92 శాతం మార్కులు సాధించారని, బీకాంలో 94 శాతం మార్కులతో ఏ.రాధారాణి యూనివర్శిటీ టాపర్గా నిలిస్తే, ఎన్ ప్రసన్న, ఆర్ అరుణ, బి.లలిత, జి.చందనప్రియ 93 శాతం వంతున మార్కులు సాధించి తమ కళాశాలకు ఘనకీర్తిని తెచ్చారని వారు ప్రశంసించారు. మొత్తంగా అయిదుగురికి 99శాతం పైగా మార్కులు, 17 మందికి 98 శాతం పైగా, 102 మందికి 95 శాతంపైగా, 358 మందికి 90 శాతంపైగా మార్కులు వచ్చాయని వారు పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులందరినీ కళాశాల డైరెక్టర్లు అభినందించారు.

# గిడుగుకు రవాణాశాఖ అధికారుల నివాళి

వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా ఆగస్టు 29న నెల్లూరులోని ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది గిడుగు రామమూర్తి సేవలను గుర్తుచేసుకుంటూ ఆయనకు ఘన నివాళులర్పించారు. ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఉప రవాణా కమిషనర్ చందర్ గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. తెలుగు భాషకు అద్వితీయమైన సేవలం



దించిన మహనీయుడు గిడుగు రామమూర్తి జయంతి రోజు తెలుగు భాషా దినోత్సవం కావడం తెలుగువారి అదృష్టమని చందర్ ఈ సందర్భంగా చెప్పారు. రీజనల్ రవాణా శాఖ అధికారిణి శ్రీచందన, మోటార్ వాహన తనిఖీ అధికారులు రఘువర్ధన్రెడ్డి, స్వప్నిల్కుమార్రెడ్డి, కార్యాలయ పరిపాలనాధికారులు కిషోర్, రామ్మోహన్, సహాయ వాహనతనిఖీ అధికారులు పూర్ణచంద్ర రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# వీఎస్యులో తెలుగు భాషా దినోత్సవం

నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం జరిగింది. తిక్కన సాహితీ పీఠం తెలుగు శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యావహారిక భాషోద్యమ పితామహులు గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి విజయ ఆనంద్కుమార్ బాబు పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి తెలుగుభాషకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలుగుశాఖ అధ్యాపకులు డాక్టర్ సి.రాజారామ్, డాక్టర్ టి.విమల, డాక్టర్ కె.లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## శేషాచార్యులుకు..
# బంగారు నంది అవార్డు

ఇందుకూరుపేటలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు, జిల్లా అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వెంకటశేషాచార్యులకు మంజునాథ ఫౌండేషన్ వారు ఆగస్టు 29న బంగారు నంది పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్ లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఆ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ మంజులగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి జి.కిషన్రెడ్డి, తెలంగాణ హోంశాఖ మంత్రి షేక్ మహమ్మద్ అలీ, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రముఖ సినీనటుడు పృధ్వీరాజ్ తదితరుల సమక్షంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. జిల్లా అర్చక సమాఖ్య కార్యవర్గసభ్యులు రామాయణం మణికుమార్శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## చంద్రశేఖర్‌కు.. చందర్ సన్మానం



తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని నెల్లూరు ఉప రవాణా కమిషనర్ చందర్ ఆత్మీయంగా సన్మానించారు. లైసెన్సు రెన్యువల్ కోసం ఆగస్టు 29న తమ కార్యాలయానికి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన సాదరంగా స్వాగతించి తమ అధికారులతో కలసి ఆయన్ను సత్కరించారు. చందర్ ఆధ్వర్యంలో ప్రజలందరికీ రవాణాశాఖకు సంబంధించిన సేవలను ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత గడువు లోపు అందిస్తుండడం సంతోషకరమని ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి రవాణాశాఖ అధికారులను కొనియాడారు. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిణి శ్రీచందన తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

జిల్లా వ్యాప్తంగా ఇటీవల వరలక్ష్మీవ్రతాన్ని మహిళాభక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. శ్రావణమాసం రెండో శుక్రవారం రోజున వచ్చిన ఈ పర్వదినం సందర్భంగా ప్రజలు ఇంటింటా వరలక్ష్మీదేవి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయాల్లో కొలువైవున్న అమ్మవార్లు వరలక్ష్మీదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో అమ్మవారి దేవాలయాలు



కళకళలాడాయి. సామూహిక వరలక్ష్మీవ్రత పూజలతో భక్తులు అమ్మవారిని కొలుచుకున్నారు. నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరిదేవి అమ్మవారి దేవాలయం, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయం, మూలాపేటలోని శ్రీ భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరాలయం, సుజాతమ్మ కాలనీలో అష్టలక్ష్మీదేవి ఆలయం, స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఇలా అన్ని దేవాలయాల్లో విశేష పూజలు, కుంకుమ పూజలు వగైరాలతో అమ్మవారిని అర్చించారు.



## వేమిరెడ్డి దంపతుల 'వాత్సల్యం'

### అనాధ శరణాలయానికి రూ.5 లక్షల విరాళం

నెల్లూరులోని వాత్సల్య-జనహిత సంస్థ నిర్వహిస్తున్న చిన్నారులు, వృద్ధుల అనాధ శరణాలయంపై రాజ్యసభ సభ్యులు, మనసున్న మారాజులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు తమకున్న వాత్సల్యాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. అక్షరాల అయిదు లక్షల రూపాయల భూరివిరాళాన్ని ఆ సంస్థకు అందజేసి అనాధలైన చిన్నారులకు, నిరాదరణకు గురైన వృద్ధులకు మానవీయ హృదయంతో ఆర్థిక సాయాన్ని అందజేసి ఆ అభాగ్యుల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇప్పుడే కాదు, ఏళ్ళతరబడిగా వాత్సల్యకు లక్షలాది రూపాయలను వితరణగా ఇస్తూ ఆ సంస్థకు వారు తమ చేయూతనందిస్తూనే ఉన్నారు. ఇటీవల నెల్లూరులోని విపిఆర్ నివాసంలో వాత్సల్య కార్యదర్శి జీవీ సాంబశివరావుకు ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

## ఇరుకళలమ్మ ఆలయం అభివృద్ధికి సహకరిస్తామన్న విపిఆర్ దంపతులు

**- దేవస్థానం ఛైర్మెన్ ఆర్ఎస్ఆర్**



నెల్లూరు గ్రామ దేవత శ్రీ ఇరుకళల అమ్మవారి ఆలయం అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. టిటిడి ఉత్తర భారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు సానుకూలంగా స్పందించారని ఇరుకళమ్మ ఆలయ కమిటీ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు(ఆర్ఎస్ఆర్) సంతోషం వ్యక్తంచేశారు. సెప్టెంబరు 1న జరిగే అమ్మవారి పుష్పయాగానికి వారిని ఆహ్వానించేందుకు వెళ్ళిన సందర్భంగా ఆలయ అభివృద్ధి విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. జిల్లా దేవాదాయ శాఖ ఏ.సీ జె.శ్రీనివాసరావు, ఇఓ మల్లికార్జున్ రెడ్డి, అర్చకులు జయస్వామి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

## తెలుగు భాష మాధుర్యం ఎనలేనిది

### క్షేత్రప్రచారకశాఖ అధికారి పరవస్తు నాగసాయి సూరి




నెల్లూరులోని డికెడబ్ల్యు మహిళా కళాశాలలో ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నెల్లూరు జిల్లా క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి మాట్లాడుతూ తెలుగు భాషలో ఉన్న మాధుర్యం సాటిలేనిదని కొనియాడారు. అంతటి మాధుర్యం ఇతర భాషల్లో లేదన్నారు. తెలుగు భాషలోని ప్రతి పద్యం వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులందరూ మాతృభాషలోని సాహిత్యంపై చక్కని అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. ఎ.వి.రమణరావు, సమన్వయకర్త డా. పి.ఎమ్.వి.ప్రసాద్ సమాచార పౌరసంబంధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.సదారావు, ఏపీయుడబ్ల్యుజె అధ్యక్షుడు జయప్రకాష్, అధ్యాపకులు డా.వి.చెంచురామయ్య, డా. కె.వి. సత్యనారాయణ, డా.సురేంద్ర, డా. కె.కరుణశ్రీ, డా. ఐ.సుభాషిణి, డా.వై.దివ్య, డా. కె.ఈశ్వరమ్మ పాల్గొన్నారు.


## 'చిన్ని'కి.. గిడుగు పురస్కారం



నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం వారు తెలుగు వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పురస్కారాన్ని బహుకరించారు. ఆగస్టు 29న గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్ని నారాయణరావు ఆ అవార్డును అందుకున్నారు. జీవితం ఓ విజయం, అంతర్ముఖం, గుండెదీపం, గంపకూడు వంటి వచన కవితాసంపుటాలు, మాట-దీర్ఘకవితతో కవితారంగంలో తనదంటూ ఒక ప్రత్యేకస్థానాన్ని నిలుపుకున్న నారాయణరావు తెలుగుభాష అభివృద్ధికి చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనకు ఈ అవార్డును అందజేయడం విశేషం. కలెక్టర్ ఢిల్లీరావు, ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం- తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు తదితర ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## 'తంగిరాల మహాభారతం' 70వ భాగం

శిశుపాలుడు రాజసూయ యాగంలోంచి కోపంతో వెళ్లిపోతుంటే, ధర్మరాజు గబగబా వెళ్లి ఆపి అతన్ని బ్రతిమిలాడుతుంటే, భీష్ముడు వారించి ఈ శిశుపాలుడు మూర్ఖుడు, దురహంకారి అని శిశుపాలునితో... శ్రీకృష్ణుని ప్రతిభాశక్తి గురించి చెప్పి, సభలో పెద్దలకెవరికీ లేని అభ్యంతరం నీకెందుకని, శ్రీకృష్ణుని మహత్తు గ్రహించలేవని చెపుతాడు.




ఇదంతా సహదేవుడు చూసి కోపంతో శ్రీకృష్ణుణ్ణి అంగీకరించని వాళ్ళ కిరీటాలమీద తన వామపాదముంచి సంహరిస్తానంటాడు. శిశపాలుని సైన్యాధ్యక్షుడు సునీదుడు తన సైన్యాన్ని సమీకరించి యుద్ధానికి సన్నాహం చేస్తాడు. ధర్మరాజు భయపడి భీష్ముణ్ణి శాంతపరచమంటే, శిశుపాలుడు భీష్ముణ్ణి పరుష మాటలతో నిందిస్తాడు. శ్రీకృష్ణుని కూడా చులకనగా మాట్లాడతాడు.

ఇదంతా చూస్తున్న భీముడు కోపం పట్టలేక శిశుపాలుడి మీదకు విజృంభిస్తాడు. భీష్ముడు భీముణ్ణి నివారించి, శిశుపాలుడి జన్మ వృత్తాంతం వివరిస్తాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




## డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో.. తెలుగుభాషోత్సవం



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్‌లో ఆగస్టు 29న తెలుగు భాషోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగువారి సంప్రదాయ వస్త్ర ధారణతో కనువిందు చేశారు. కవిత్రయంగా పేరొందిన నన్నయ్య, తిక్కన, ఎర్రనలతో పాటు పదకవితా పితామహుడు అన్నమయ్య, వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి వంటి మహనీయుల వేషధారణలతో అలరించారు. డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా అద్దాలమందిరంలో.. పెంచలస్వామి కల్యాణం



నెల్లూరు బాలాజీనగర్‌లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలోని సాయిమాత నిత్యాన్న ప్రసాద నిలయం ద్వారకామాయిలో ఆగస్టు 26న ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ద్వారకామాయి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవాధ్యక్షులు పాబోలు రామసుబ్బయ్య తదితరులు ఈ వేడుకను పర్యవేక్షించారు.




## అస్సాం గవర్నర్‌కు సిఎంకె రెడ్డి ఆత్మీయ సన్మానం

ఇటీవల చెన్నైకి విచ్చేసిన అస్సాం గవర్నర్ గులాబ్‌చంద్ కటారియాను గౌరవపూర్వకంగా కలసి సన్మానించి, తమిళనాడులో మైనార్టీ భాషల వారి సమస్యలపై తాము రూపొందించిన పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేస్తున్న అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సిఎంకె రెడ్డి.

# చంద్రయాన్-3లో భాగస్వాములైన శ్రీసిటీ పరిశ్రమలు

## --- పలు జాతీయ ప్రాజెక్టులతోనూ అనుబంధం ---

'చంద్రయాన్-3' ప్రయోగం విజయవంతం కావడం హర్షదాయకం. అంతేకాదు, ఇది దేశీయ పారిశ్రామిక రంగానికి కూడా అత్యంత ప్రోత్సాహకరమైన అంశం. చంద్రయాన్ నిర్వహణకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నాయకత్వం వహిస్తూనే, ప్రభుత్వ ప్రైవేట్‌రంగ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తూ వారికి కూడా తగిన గుర్తింపుని తీసుకువస్తోంది ఇస్రో. చంద్రయాన్ ప్రయోగం ద్వారా లాంచ్ వెహికల్, అంతరిక్ష నౌక, ఇతర అంతరిక్ష ప్రయోగాలకి అవసరమైన మౌలిక సదుపాయాలను, పరికరాలను సరఫరా చేస్తూ పలు దేశీయ పరిశ్రమలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ కోవలో చంద్రయాన్-3 మిషన్‌తో సహా ఇస్రోకి సంబంధించిన పలు కార్యక్రమాలలో శ్రీసిటీలోని విఆర్‌వి (చార్ట్ గ్రూప్), రోటోలోక్, వాల్-మెట్ ఇంజనీరింగ్ అనే మూడు పరిశ్రమలు భాగస్వాములు కావడం ఎంతైనా విశేషం. ఒకరకంగా అది శ్రీసిటీకే గర్వకారణం అని కూడా చెప్పవచ్చు.




విఆర్‌వి పరిశ్రమ అమెరికా చార్ట్ గ్రూప్‌కు చెందినది. అది నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, ద్రవ హైడ్రోజన్, సహజ వాయువుల నిల్వ, పంపిణీ కోసం పూర్తి స్థాయి ఉత్పత్తులను డిజైన్ చేస్తుంది. 'మేక్ ఇన్ ఇండియా' పథకం కింద ఇస్రో సహకారంతో లిక్విడ్ నైట్రోజన్ షీల్డ్ కలిగిన అత్యాధునికమైన పెద్ద ఎల్‌హెచ్-2 నిల్వ ట్యాంక్‌ను ఎస్‌డిఎస్‌కి (షార్ కేంద్రం) సరఫరా చేసింది. ఈ ట్యాంక్ నిల్వ సామర్థ్యం 120 కిలోలీటర్లు. ఎల్‌విఎం 3, జిఎస్‌ఎల్‌వి రాకెట్ల క్రయోజెనిక్ దశలో ఎల్‌హెచ్-2 ట్యాంక్ ద్వారా ఇంధనం నిల్వ చేశారు. శ్రీసిటీలోని యూకెకు చెందిన రోటోలోక్ ఇండియా పరిశ్రమలో కొన్ని పౌడర్‌లు మరియు బల్క్ మెటీరియల్ హ్యాండ్లింగ్ ఉత్పత్తులలో భాగమైన రోటరీ ఎయిర్‌లాక్‌లు, డైవర్టర్ వాల్వ్‌లు, స్లైడ్ వాల్వ్‌లు, బిగ్ బ్యాగ్ సిస్టమ్‌లు, కన్వేయర్లు, డిశ్చార్జ్ యూనిట్లు తయారుచేస్తారు. రోటోలోక్ ఉత్పత్తులను శ్రీహరికోటలోని ఇస్రో సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్ తయారీ ప్లాంట్‌లో ఉపయోగిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేయబడిన ప్రొపెల్లెంట్ పరికరాలు ఎల్‌విఎం-3 ఘన బూస్టర్‌కు మరియు పిఎస్‌ఎల్‌వి, జిఎస్‌ఎల్‌వి, ఎస్‌ఎస్ ఎల్‌విల ఘనప్రొపెల్లెంట్ దశలకు బాగా ఉపయోగపడుతున్నాయి.

అదేవిధంగా, శ్రీసిటీలోని వాల్-మెట్ ఇంజినీరింగ్ సంస్థ సూపర్ అల్లాయ్స్ నికెల్, టైటానియం, కోబాల్ట్, అల్యూమినియం మొదలైన వాటిని వివిధ రూపాల్లో ఎల్‌విఎం-3, చంద్రయాన్-3 వ్యోమనౌకలతో సహా ఇస్రో లాంచ్ వెహికల్స్‌ను, ఉపగ్రహాల హార్డ్‌వేర్‌లను రూపొందించడానికి ముడి పదార్థాలుగా సరఫరా చేస్తుంది. ఇస్రోతో భాగస్వామ్యానికి ఆయా పరిశ్రమల కృషి అభినందనీయమని ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల తన సందేశంలో పేర్కొన్నారు. జాతీయ అంతరిక్ష కార్యక్రమానికి శ్రీసిటీ పరిశ్రమలు తమ ఉత్పత్తులను సరఫరా చేయడం సంతోషదాయకమన్నారు. ముమ్ముందు ఇలాంటి ఆత్మనిర్భరతా కార్యక్రమాలలో మరిన్ని శ్రీసిటీ పరిశ్రమలు భాగస్వామ్యం కావడానికి ఎదురుచూస్తున్నా యని కూడా పేర్కొన్నారు. హంటర్ డగ్లస్, సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమలు, దస్సాల్ట్ రాఫెల్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్‌కు ఉత్పత్తులు సరఫరా చేయగా, బిఎఫ్‌జి పరిశ్రమ తమ ఎఫ్‌ఆర్‌పి ఉత్పత్తులను భారతీయ వందే భారత్ రైళ్ళకు, అనేక మెట్రో ప్రాజెక్టులకు సరఫరా చేస్తోందని తెలిపారు.

### ఏరోస్పేస్‌కు అనువైన కేంద్రంగా శ్రీసిటీ

ఇస్రో లాంటి సంస్థలకు ఎన్2, ఎల్‌ఓఎక్స్, ఎల్‌హెచ్-2 హీలియం వంటి పారిశ్రామిక వాయువుల తయారీ, సరఫరా భారీ స్థాయిలో అవసరం. అలాగే అది లాంచ్ సైట్‌కు దగ్గరగా అందుబాటులో ఉండడం మరీ ముఖ్యం. వాటిని దూర ప్రాంతాల నుంచి రవాణా చేసేందుకు అయ్యే ఖర్చు భారీగా ఉంటుంది. ప్రయోగ వాహనం, ఉపగ్రహాల ప్రయోగ ఏర్పాట్లతో అవసరమైన ఉత్పత్తులు సమీపప్రాంతంలోనే లభ్యం కావడం అవసరం. అందుకు సంబందించిన పలు పరిశ్రమలతో శ్రీసిటీ ఏరోస్పేస్‌కు అనువైన కేంద్రంగా మారింది. దీని ఫలితంగా చాలామంది స్కిల్డ్, సెమీ-స్కిల్డ్ వ్యక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతుండడం ఎంతైనా విశేషమే!...

# పంచభూతాలను కూడా దోచుకుంటున్నారు



వైకాపాపై సోమిరెడ్డి ధ్వజం

తమను నిర్బంధించడం కాదు.. రాష్ట్రంలో ఇసుక దోపిడీ ఆపాలంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇసుక అక్రమరవాణాలకు వ్యతిరేకంగా ఆగస్టు 29న టిడిపి ఆధ్వ ర్యంలో ఇసుకరీచ్‌ల ముట్టడి కార్యక్రమం జరిగింది. ఈ నేపథ్యంలో నెల్లూరు సమీపంలోని అల్లీపురంలో ఉన్న సోమిరెడ్డి నివాసంలో పోలీసులు ఆయన్ను నిర్బంధించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో ఇసుక దోపిడీ జరుగుతోందన్నారు. నేరుగా ముఖ్యమంత్రి సొంత మనుషులకు జిల్లాల వారీగా భాగాలు పంచేసి వేల కోట్లు దండుకుంటున్నారని, నాలుగున్నరేళ్లుగా ఇలాంటి భారీ కుంభకోణాలన్నింటికీ ఆంధ్రప్రదేశ్‌ను అడ్డాగా మార్చేశారని ఆయన ధ్వజమెత్తారు. ప్రకృతిని, పంచ భూతాలను కూడా ఇష్టారాజ్యంగా దోచేసుకుంటున్నారని, ఇసుక నుంచి మద్యం వరకు వేల కోట్ల కుంభకోణాలు జరుగుతున్నాయని, ఇకనైనా కేంద్రప్రభుత్వం స్పందించాలని, దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి ఈ దోపిడీలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## సీఎం జగన్‌కు..రామ్ స్వాగతం

చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన కార్యక్రమానికి హాజరయ్యేందుకు తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సాదర స్వాగతం పలుకుతున్న తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

# రక్షితను రక్షించిన విపిఆర్

## కాలేయ శస్త్ర చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 17.50లక్షలు మంజూరు చేయించిన 'సేవాభూషణ్'



**కాలేయం దెబ్బతిని తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఓ విద్యార్థినికి లివర్ ప్లాంటేషన్ చేయించేందుకు అవసరమైన భారీ మొత్తం.. అక్షరాలా పదిహేడు లక్షలా 50వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసేందుకు రాజ్యసభ సభ్యులు, సేవాభూషణ్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సంకల్పించారు. ఆమేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో ఆ విషయం చర్చించి ఆ విద్యార్థినిని కాపాడేందుకు అవసరమైన నిధిని సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు చేయించి తన గొప్ప మనసును చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.**

కావలి నియోజకవర్గం దగదర్తికి చెందిన యామాల శివరామమ్మ కుమార్తె రక్షిత లివర్ సమస్యతో గత కొన్ని నెలలుగా బాధపడుతోంది. వైద్యం కోసం ఇప్పటికే ఆ కుటుంబీకులు చాలా ఖర్చు చేశారు. లివర్ ఆపరేషన్ చేయాలంటే ఇంకా చాలా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారు. అయితే వారి కుటుంబానికి అంత ఖర్చు భరించే ఆర్థికస్తోమతు లేకపోవడంతో ఏం చేయాలో, తమ పాపను ఎలా రక్షించుకోవాలే తెలియక దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. దాంతో శివరామమ్మ.. కొందరు స్నేహితుల ద్వారా ఆ విషయాన్ని రాజ్యసభ సభ్యులు, మనసున్న మహనీయుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆ విద్యార్థిని పరిస్థితిని విని చలించిపోయిన విపిఆర్ వెంటనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అయ్యే ఖర్చును సీఎం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పకుండా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 17 లక్షల 50 వేల రూపాయలను విడుదల చేయించి, అందుకు సంబంధించిన పత్రాన్ని ఆగస్టు 30న విపిఆర్ నెల్లూరులోని తన నివాసంలో శివరామమ్మకు అందజేశారు. తమ పాపను రక్షించేందుకు విపిఆర్ చేసిన సహాయాన్ని మర్చిపోలేమని, అందుకు నిధులిచ్చిన సీఎం వైఎస్ జగన్‌కి జీవితాంతం రుణపడి ఉంటామని శివరామమ్మ చెప్పారు.




# తెలుగు వెలుగు.. గిడుగు రామమూర్తి



వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి భాషాసేవలు అపూర్వమని నెల్లూరులోని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. ఆగస్టు 29న ఆ మహనీయుని జయంతిని పురస్కరించుకుని గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక ఆధ్వర్యంలో, గోవిందరాజు సుభద్రాదేవి సారధ్యంలో జరిగిన సాహితీ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. స్థానిక మినీబైపాస్ రోడ్డులోని మార్బుల్‌నర్సరీలో జరిగిన ఈ కార్యక్రమానికి సారస్వతవేత్త డా. గిరిజాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు రామమూర్తి తెలుగుభాషకు చేసిన సేవలు వివరిస్తూ ఆయన తెలుగు వెలుగు అని కీర్తించారు. తొలుత సంగీత ఉపాధ్యాయురాలు శ్రీవత్సల విద్యార్థులు 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ' గీతాన్ని ఆలపించారు. లక్ష్మీభవాని. వినయ తదితరులు పలు గీతాలను గానం చేశారు. ఇటీవల 'ఆటా' అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారు నిర్వహించిన కవితల పోటీల్లో బహుమతి పొందిన మోపూరు పెంచలనరసింహం, ఎక్స్‌రే కవితల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన నల్లు రమేష్, ప్రత్యేక బహుమతి పొందిన అవ్వారు శ్రీధర్‌బాబులకు ఈ సందర్భంగా సన్మానం చేశారు. పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, కవులు ఇంద్రగంటి మధుసూధన్‌రావు, జె.రామ్మోహన్, కె.అంకంబాబు తదిరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుని ఆకస్మిక మరణం



మండల కేంద్రమైన రాపూరులో సుదీర్ఘకాలం పత్రికా రంగంలో ఉంటూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేస్తున్న సీనియర్ విలేకరి కె.ఆనంద్ (54) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. రాత్రి భోజనం చేశాక శ్వాస తీసుకోవడంలో కష్టంగా ఉందని చెప్పడంతో ఆయన్ను కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం విషమించడంతో వెంటనే నెల్లూరుకు తీసుకుపోవాలని వైద్యులు చెప్పగా, ఆ ప్రయత్నం చేస్తుండగనే అర్ధరాత్రి సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆనంద్ ఆకస్మిక మరణానికి కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

## - ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని, విధి నిర్వహణలో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాల వారికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ డా.కె తిరుమలేశ్వరరెడ్డి చెప్పారు. ఆగస్టు 29న పోలీసు సంక్షేమ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఉమేష్‌చంద్ర స్మారక సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో గత ఏడాది సెప్టెంబరు నుంచి ఇప్పటిదాకా విధి నిర్వహణలో కన్నుమూసిన 16 మంది పోలీసు సిబ్బంది కుటుంబసభ్యులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన బాధిత కుటుంబాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల సేవలు మరువలేనివని, వారి కుటుంబాల శ్రేయస్సుకు జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందని చెప్పారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తనను వచ్చి కలిస్తే, ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలవారికి ప్రభుత్వం తరఫున అందాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన వచ్చేందుకు, మృతిచెందిన పోలీసు సిబ్బంది పిల్లలకు కారుణ్య నియామకాల విషయంలో సహకరిస్తామన్నారు. అనంతరం పోలీసు కుటుంబాలకు జిల్లా ఎస్పీ స్వయంగా భోజనం వడ్డించారు. ఏఎస్పీ డి.హిమవతి, ఏఆర్ డిఎస్పీ ఎం.గాంధీ తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును ఇటీవల హైదరాబాదులో కలిసి జ్ఞాపికను అందజేస్తున్న కర్నాటక టిడిపి కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

## --- ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.విజయకుమార్‌రెడ్డి ---




విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ మేటిగా రాణించాలని కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.వి విజయకుమార్‌రెడ్డి చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం (మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి)ను పురస్కరించుకుని ఆగస్టు 29న ఎన్‌బికెఆర్ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా ఉల్లాసాన్ని కలిగిస్తాయని, కళాశాలలో ఉన్న క్రీడాప్రాంగణంలోని వనరుల్ని ఉపయోగించుకుని విద్యార్థులు దేశం గర్వపడేవిధంగా క్రీడల్లోనూ ముందడుగు వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## త్వరలో వంతెన పనులు ప్రారంభం



అసంపూర్తిగా నిలిచిపోయిన గూడూరు వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, అడ్డుగా ఉన్న నిర్మాణాలకు నష్టపరిహారం అందజేసి తొలగిస్తున్నట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు ఐసీఎస్ రోడ్డులోని నిర్మాణాలను ఆగస్టు 28వ తేదీ జేసీబీ యంత్రంతో తొలగింపు చర్యలు చేపట్టారు. వంతెన 12 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిందని, పనులు వేగవంతం చేశామని చెప్పారు. త్వరలో పరిహారం చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రోడ్లు భవనాల డి.ఇ సుబ్బారెడ్డి, సి.ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ధరల భారం నుంచి కాపాడండి



రాష్ట్రంలో ధరల భారం నుంచి పేదలను కాపాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆగస్టు 27వ తేదీ నియోజకవర్గ స్థాయి సమితి సమావేశం సీనియర్ నాయకుడు సీతా భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అనేక రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, రాష్ట్రంలో పెరిగిన పన్నులతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని విమర్శించారు. 8వ తేదీ తిరుపతిలో బస్సు యాత్ర ముగింపును జయప్రదం చేయాలని ప్రభాకర్ పిలుపునిచ్చారు. వామపక్ష నాయకులు శశికుమార్, కుమార్, రమేష్, నారాయణ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## వివిఎస్‌ఆర్‌లో కవుల వేషధారణ

గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వి.ఎస్.ఆర్ పాఠశాలలో ఆగస్టు 29వ తేదీ తెలుగు భాషా దినోత్సవం మరియు క్రీడా దినోత్సవాలను జరుపుకున్నారు. దాదాపు 100 మంది పైగా పిల్లలు కవుల వేషధారణలో వచ్చి అలరించారు. వివిధ తరగతుల పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. చార్ట్ ప్రదర్శన, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు కూడా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ నందిమండలం బాలకృష్ణంరాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపల్ శాంతకుమార్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## టిసిఎల్ విజేత బాలాయపల్లి



ఆగస్టు 25 నుండి 28వ తేదీ వరకు గూడూరు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్(టిసిఎల్)లో బాలాయపల్లి జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా వాకాడు జట్టు నిలిచింది. సెప్టెంబర్ 5 "ఉపాధ్యాయ దినోత్సవం" సందర్భంగా ప్రతి సంవత్సరం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ టిసిఎల్ టోర్నమెంట్ ఈ ఏడాది కూడా అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగింది. టోర్నమెంటు విజేతలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, శ్రియా రియల్‌ఎస్టేట్స్ అధినేత బాబు ఆగస్టస్ చేతుల మీదుగా మెడల్ మరియు షీల్డ్‌లను బహుకరించారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గసభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డులు సమర్పించాలి

### రూరల్ ఎస్ఐ బ్రహ్మనాయుడు



గూడూరు గాంధీనగర్‌లోని టిడ్కో గృహాలలో అద్దెకు చేరేవారి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర గుర్తింపు కార్డులు, అద్దెలుకు ఇచ్చే గృహ యజమానుల గుర్తింపు కార్డుల జెరాక్స్ పత్రాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లో అందజేయాలని రూరల్ ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపారు. ఆదివారం టిడ్కో గృహాలను పరిశీలించిన ఆయన, గృహాల్లో నివాసముంటున్న ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ గృహాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వారి ఆగడాలను నియంత్రించేందుకు తమ సహాయసహకారాలు పొందవచ్చన్నారు.

## రోటరీ క్లబ్ 'స్పోర్ట్స్ క్విజ్'



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల గూడూరులోని వివిధ పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ వారు క్విజ్ మాస్టర్ పి.ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ క్విజ్ నిర్వహించారు. ప్రథమ బహుమతిని ప్రాస్పరో, ద్వితీయ బహుమతిని సాయి విద్యానికేతన్, తృతీయ బహుమతిని రత్నం ఇంగ్లీషు మీడియం స్కూల్స్ అందుకున్నాయి. రోటరీ క్లబ్ అధ్యక్షులు సి.రామకృష్ణ స్వరూప్, బి.శివకుమార్‌రెడ్డి, స్పోర్ట్స్ క్విజ్ కో-ఆర్డినేటర్ ఎన్.బాలకృష్ణంరాజు, రోటరీ మాజీగవర్నర్ కె.మునిగిరీష్, అసిస్టెంట్ గవర్నర్ బి.శ్యామసుందరరావు, సీనియర్ రొటేరియన్ బి.దశరథరామిరెడ్డి, టి.సురేష్‌రెడ్డి, బలరామిరెడ్డి పాల్గొన్నారు.



## పొన్నూరమ్మకు ప్రత్యేక పూజలు

మనుబోలు మండలం వడ్లపూడి గ్రామదేవత పొన్నూరమ్మ అమ్మవారికి ఆగస్టు 27న ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. ఈగ సురేష్–సుభాషిణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు.

# గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ తొలి ప్రిన్సిపాల్‌గా, కళాశాల తొలి డైరెక్టర్‌గా డా. ఐ.గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎన్‌బికెఆర్ ప్రస్తుత డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. ఆగస్టు 27న డా. గోపాల్ రెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్‌బికెఆర్ ప్రాంగణంలో ఉన్న గోపాల్‌రెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా.విజయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి, ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ స్థాపకులు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి గోపాల్‌రెడ్డి అత్యంత సన్నిహితులని, వారి తోడ్పాటుతో కళాశాలకు ఎంతో కీర్తివచ్చిందని కొనియాడారు. జెఎన్‌టియు వైస్‌చాన్సలర్‌గా కూడా సేవలందించిన గోపాల్‌రెడ్డి, ఆ తర్వాత ఎన్‌బికెఆర్ కళాశాల అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రస్తుతం కళాశాల కరెస్పాండెంట్‌గా ఉన్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూడా కళాశాల అభ్యున్నతికి అపారమైన సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఎన్‌బికెఆర్ కళశాలలోని వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధర్మరాజస్వామి గుడిలో.. 3న చండీహోమం



నెల్లూరు నవాబుపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయంలో సెప్టెంబరు 3న చండీహోమం నిర్వహిస్తామని ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు తెలిపారు. ఆగస్టు 27న ఆమేరకు యాగం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా ఈ యాగం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నికుల క్షత్రియసంఘం అధ్యక్షుడు నగరి చంద్రశేఖర్, వైస్‌ఛైర్మెన్ ఆరణి వెంకట శేషయ్య, ఆలయ ఛైర్మెన్ నాగయ్య, సభ్యులు భీమయ్య, ఎన్. సుధాకర్‌రెడ్డి, విఘ్నేష్ పాల్గొన్నారు.

# రాజకీయాలపై ఆసక్తి ఉంటే... ఈ పుస్తకం చదవాల్సిందే!




**ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ & శాసనసభలో**
**ఎవరెవరు? 1952-2019**
రచయిత:
**మారిశెట్టి మురళీ కుమార్**
పేజీలు : 456 వెల. 750/-
ప్రతులకు:
మారిశెట్టి మురళీ కుమార్
సెల్ : 98483 53503.


*మీకు తెలుగు రాజకీయాలపై ఆసక్తి ఉందా?*

*'ఆసక్తి'... అంటే ఏమిటి!*

*పడక్కుర్చీలో కూర్చుని... పేపరు, టీవీ చూస్తూ రాజకీయాలను గమనించే ఆసక్తా? లేకపోతే, మిత్రులతో... తెలిసిన వారితో సరదాగా వాదోపవాదాలు చేస్తూ, భోజనం వేళ అయ్యేవరకు కాలక్షేపం చేసే ఆసక్తా?*

*రాజకీయ పార్టీలలో తిరగాలనే ఆసక్తా? ఛాన్స్ దొరికితే, ఏదో ఒక పదవికి పోటీ చేయాలి అనే ఆసక్తా?*

*ఇప్పటికే రాజకీయాల్లో ఉన్నారా? రాజకీయాలను పిండి వడబోసేశారా? ఇప్పుడు వడ బోస్తున్నారా? లేకపోతే.... ముందు ముందు వడబోయబోతున్నారా?*



పుస్తక రచయిత మురళితో సమీక్షకులు భోగాది

సరే! మొత్తంమీద తెలుగు రాజకీయాలపై ఏదో ఒక రూపంలో ఆసక్తి ఉందనే అనుకుందాం.

మన వెంకయ్యనాయుడు అసెంబ్లీకి ఎప్పుడెప్పుడు ఎన్నికయ్యారు?

ఏసీ సుబ్బారెడ్డి ఎన్నిసార్లు శాసనసభకు... ఎప్పుడెప్పుడు ఎన్నికయ్యారో ఠక్కున చెప్పగలరా? పోనీ... బెజవాడ గోపాలరెడ్డి? మరి, బెజవాడ పాపిరెడ్డో?

మరీ పాతకాలపు నాయకులు కదా... అనుకుంటే... మన శీనయ్యో!?

అదే, ఎన్‌టీ రామారావును గడగడలాడించిన నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి!? పోనీ, వాళ్ళబ్బాయి ప్రసన్నకుమార్‌రెడ్డో!?

వీరు ఎప్పుడెప్పుడు ఏ చట్టసభకు ఎన్నికయ్యారో గబగబ చెప్పేయగలరా? పోనీ... ఏ నియోజకవర్గంలో ఏ కులపు 'ఓటరు మహాశయులు' ఎంతమంది ఉన్నారో అంచనా ఉందా?

మనకు 70ఏళ్ళ నుంచి... అంటే, 1952 నుంచి చట్టసభలకు ఎన్నికలు జరుగుతున్నాయి కదా.

సరే! గెలిచేవాళ్ళు గెలుస్తున్నారు. ఓడిన వారు ఓడుతున్నారు.

గెలిచినవారు... ఓడినవారూ చరిత్ర పుటల్లోకి జారిపోతున్నారు.

ఎవరెవరు. మన ప్రజాస్వామిక ప్రక్రియను ఎప్పుడెప్పుడు సుసంపన్నం చేస్తూ వచ్చారో తెలుసుకోవడం... సమాజ నడకకు అవసరం.

వందలు, వేల సంఖ్యలో ఉన్న ఇంతమంది ఎంఎల్ఏలను, ఎంపీలను ఎక్కడ గుర్తుపెట్టుకుంటాం మాస్టారూ అంటే గనుక...

ఈ జాబితా ఓసారి చూడండి.

ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానందరెడ్డి, పీవీ నరసింహారావు, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, టీ.అంజయ్య, భవనం వెంకట్రాం (రెడ్డి), కోట్ల విజయభాస్కరరెడ్డి, ఎన్‌టీ రామారావు, నాదెండ్ల భాస్కరరావు, నేదురుమల్లి జనార్థనరెడ్డి, చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కే.రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, మన రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పని చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉన్నారు. మరి వీరు ఎప్పుడెప్పుడు, ఎవరి తరువాత ఎవరు ముఖ్యమంత్రులుగా పని చేశారో చెప్పగలమా?

అంటే... చెప్పలేమేమో అని చెప్పగలం. ఎందుకంటే... అది చరిత్ర.

కానీ, ఇదంతా తవ్వి, రికార్డులు తిరగేసి, ఒక క్రమపద్ధతిలో మనకు అందిస్తే... ఇదీ మన చరిత్ర అని వడ్డించిన విస్తరిలా మనముందు పరిస్తే... ఎంత బావుండునో కదా అని అనిపించడం సహజం.

ఆ పనే చేశాడు... ఓ యువ జర్నలిస్ట్ మారిశెట్టి మురళీకుమార్.

గత 23 ఏళ్ళుగా తెలుగు జర్నలిజంతో కుస్తీపడుతూ వస్తున్న మురళి, తెలుగు రాజకీయ గమనంలో ఎప్పటికీ గుర్తుండిపోయే పరిశోధక రచన చేశాడు. 'ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ & శాసనసభలో 1952 నుంచి ఎవరెవరు?' పేరిట 450 పేజీల బృహత్ గ్రంధం తీసుకువచ్చాడు.

ఇది చదివితే, విషయ సేకరణకు మురళి ఖర్చుపెట్టిన గంటలు, రోజులు, నెలల సమయం ఏమాత్రం వృధా కాలేదు అనిపించింది.

1978 మార్చి నెలలో విజయవాడ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ట్రైనీ సబ్‌ఎడిటర్‌గా చేరే నాటికి ముఖ్యమంత్రిగా ఉన్న చెన్నారెడ్డి దగ్గరనుంచి... రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా కళ్ళ ముందు కదిలాయి.

రాజకీయాలలో ఏ రకమైన ఆసక్తి ఉన్నవారికైనా ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తం అంటూ ఈ అపురూప పుస్తకానికి ముందుమాట రాసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసిన అభిప్రాయంతో ఏకీభవించని వారు ఉండరు.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన 'మిరియాల వేంకటరావు ఫౌండేషన్'కు, సమాచారాన్ని ఓపికగా సేకరించి, అక్షరబద్ధం చేసిన జర్నలిస్ట్ మురళికి అభినందనలు.

ఇంతటి సమాచార భాండాగారానికి కేవలం 750 రూపాయల ధర మాత్రమే పెట్టిన మారిశెట్టి మురళిని 9838353503 ఫోన్ నంబరుపై సంప్రదించి ఈ పుస్తకరాజాన్ని తెప్పించుకోవచ్చు.

గమనిక : ఇంత పెద్ద ప్రయత్నంలో అక్కడక్కడా పేర్లు, ఫోటోల ప్రచురుణలో చిన్నచిన్న తప్పులు దొర్లడం సహజం. పెద్ద మనసుతో స్వీకరిస్తే, సరిపోతుంది.

సమీక్ష : **భోగాది వేంకట రాయుడు**
సెల్ : 73311 72070

## టూకీగా...



### కొండ్లపూడిలో... వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి గ్రామంలో ప్రతి ఏడాదిలాగానే ఈసారి కూడా ఆగస్టు 27న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేసి ఆరాధనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### నారాయణపురంలో మదర్‌థెరిస్సా జయంతి

మహోన్నత మానవీయమూర్తి మదర్‌థెరిస్సా 123వ జయంతి వేడుకలు ఆగస్టు 27న దగదర్తి మండలం నారాయణపురం (తురిమెర్ల) ఎంపీపీ పాఠశాలలో జరిగాయి. ప్రభుత్వ వైద్యుడు ఎన్.ఏడుకొండలు పాల్గొని, సేవకు ప్రతిరూపంగా నిలిచిన మదర్‌థెరిస్సా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. హెడ్మాస్టర్ సిహెచ్ చెన్నయ్య, ఉపాధ్యాయులు కల్పన, ఎస్‌కె అబ్దుల్‌సలాం, బి.పద్మజ, షేక్ ఖాజామొహిద్దీన్, కె.అనన్య, సుష్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

### మడమనూరులో లక్షరూపాయల గడ్డివామి దగ్ధం

మనుబోలు మండలం మడమనూరులో ఆగస్టు 27న చేవూరు మస్తానయ్యకు చెందిన లక్షరూపాయల విలువజేసే 15 ఎకరాల గడ్డివామి అగ్నికి ఆహుతైపోయింది. ఎవరైనా కావాలనే తగులబెట్టారా? లేక ప్రమాదవశాత్తూ జరిగిందా? అన్నది తేలలేదు. మనుబోలు ఎస్ఐ అజయ్‌కుమార్ గూడూరు అగ్నిమాపక దళానికి తెలియజేయడంతో... వాళ్ళొచ్చి మంటలను ఆర్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

### నెల్లూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరులోని పెన్నానది ఇసుకదిబ్బలపై ఆగస్టు 27న పేకాటాడుతున్న ఏడుగురిని స్థానిక నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. ఏడుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 23వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.

### నర్రవాడ గోశాలకు వరిగడ్డి వితరణ

దుత్తలూరు మండలం నర్రవాడ వేంగమాంబ అమ్మవారి గోశాలలో గోవులకు మేతలేక బక్కచిక్కిపోతున్నాయనే సమాచారంతో, కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన అమ్మవారి భక్తులు చెరుకూరి వెంకటేశ్వర్లు, చిన బ్రహ్మయ్య, వీరరాఘవయ్య, రామానాయుడులు కలసి ఆగస్టు 27న రెండు ట్రాక్టర్లతో వరిగడ్డిని గోశాలకు పంపి తమవంతు సాయం అందజేశారు.

### ఏఎస్‌పేటలో తల్లితండ్రుల సమావేశం

మండల కేంద్రమైన అనుమసముద్రంపేట (ఏఎస్ పేట) బీసీ బాలుర హాస్టల్‌లో ఆగస్టు 27న తల్లితండ్రుల సమావేశం నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ షేక్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆత్మకూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.శ్రీదేవి పాల్గొని పరీక్షల పట్ల, విద్యార్థుల పట్ల తల్లితండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.


### బుచ్చిలో భగవద్గీత ప్రతుల పంపిణీ

సెప్టెంబరు మొదటివారం శ్రావణమాసంలో రానున్న శ్రీకృష్ణజన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని గాంధీనగర్‌లో ఆగస్టు 27న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి..హిందూ జ్ఞానవేదిక–నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో డి.సురమౌళి, శేఖర్, శ్రీనివాసులు, నాగార్జున, కృష్ణ తదితరులు త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను పంపిణీ చేశారు.

### ఆత్మకూరులో ఆటోవాలాలకు సిఐ క్లాస్

ఆత్మకూరు బస్టాండ్ పరిసరాల్లో ఉన్న ఆటోవాలాలకు ఆత్మకూరు సిఐ జి.వేణు ఇటీవల క్లాస్ తీసుకున్నారు. ప్రయాణీకులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, వారిని కష్టపెట్టేవిధంగా ప్రవర్తించకూడదని చెప్పారు. బస్సుల రాకపోకలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా బస్టాండ్ ప్రాంతంలో కాక, ఆటోస్టాండ్‌ల వద్ద మాత్రమే ఆటోలు నిలపాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కళ్యాణ వైభవం...!



నెల్లూరుజిల్లా వాస్తవ్యులు, బెంగళూరు నివాసి, ప్రముఖ భవన నిర్మాణ సారధి ముంగమూరు సుకేష్‌రెడ్డి - మాలినిల కుమారుడు రామ్‌కౌసిక్ - సాయిశ్రియల పరిణయం ఆగస్టు 30వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# మంచినీటికి కొరత లేకుండా చూడాలి

## అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్ళలో, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో, ఏరియా ఆసుపత్రుల్లో సురక్షిత త్రాగునీటి సదుపాయం కల్పించేలా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 31వ తేదీ గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన సంక్షేమ శాఖల అధికారులు, వైద్యం, పరిశ్రమలు, గనులు, వాణిజ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని సంక్షేమ హాస్టల్స్‌లోని పిల్లలకు, ఆసుపత్రులకు వచ్చే రోగులకు కార్పొరేట్ సెక్టార్ వారి సహకారంతో సురక్షితమైన త్రాగునీటి సదుపాయం ఏర్పాట్లకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించి పలు సూచనలు చేశారు. అందుకు తగ్గట్టుగా పది రోజుల్లో పూర్తి కార్యాచరణ ప్రణాళికను తయారుచేసి సమర్పించాలని ఆదేశించారు. అలాగే బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, మైన్స్ శాఖ డీడీ శ్రీనివాస్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఏ. రవీంద్రనాథ్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ రాజశేఖర్, డిసిహెచ్ఎస్. రమేష్‌నాథ్, ఐటిడిఎ పిఒ మందా రాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, గురుకుల పాఠశాలల డిసిఒ హేమలత తదితరులు పాల్గొన్నారు.

## రామ్‌జీకి సన్మానం



ప్రముఖ మెజిషియన్, సింహపురి సంస్కృతి సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి రామ్‌జీని ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు సన్మానించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డిల్లీ రావు, తెలుగు అధికార భాషా సంఘం ఛైర్మెన్ పి.విజయబాబు, రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు కళారంగంలో రామ్‌జీ సేవలను అభినందిస్తూ ఆయన్ను సత్కరించారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



జిల్లా యువజన సంక్షేమ శాఖ, నెహ్రూ యువ కేంద్రం-నెల్లూరు, కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(పిఎంపి) సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 28న స్థానిక బుజబుజనెల్లూరులోని శేషు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా యూత్ అధికారి డా.వి.మహేందర్‌రెడ్డి, జిల్లా పిఎంపి గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, స్కూల్ కరస్పాండెంట్ ఆదిశేషు, సెక్షన్ సూపరింటెండెంట్ యం.డి.గయాజ్ అహ్మద్, మేనేజర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్‌కు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.



## శ్రీ రంగనాథునికి శోభాయమానంగా పవిత్రోత్సవాలు

నెల్లూరు నగరంలోని రంగనాయకులపేటలో పెన్నానది ఒడ్డున కొలువుదీరి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆగస్టు 30న స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలను తిలకించారు. ఆలయ ఛైర్మెన్ శివకుమార్‌ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కమలం చేతిలో... సైకిల్ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

జరిగే వ్యవహారాలు, ఎన్నికలప్పుడు పన్నే వ్యూహాలకు మద్దతు కోసమే టీడీపీకి బీజేపీ కావాలి. గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికలు జరిగితేనే జగన్ పోల్‌మేనేజ్‌మెంట్‌ను అడ్డుకోలేక పోయారు. జగన్‌కి మోడీ అండ ఉండడం వల్ల తాము అడ్డుకోలేకపోయామన్నది టీడీపీ భావన. ఎన్నికలు అంటే అక్రమాలు, డబ్బు పంపిణీ... ఇప్పుడు జగన్ అధికారంలో ఉన్నారు. దానికి మోడీ అండ కూడా తోడైతే ఎన్నికల్లో తెలుగుదేశం ఆటలు సాగవు అనే భయం బాబుని క్షణక్షణం వెంటాడుతోంది. అందుకే టీడీపీకి బీజేపీ అండ కావాలి.

### ఇప్పుడేమైనా హోదా ఇస్తామంటున్నారా?

హోదా ఇవ్వకపోవడం వల్లనే బీజేపీకి దూరం అయ్యాను, అంతే తప్ప ఆ పార్టీతో తమకు శత్రుత్వం లేదని చంద్రబాబు చెప్తున్నారు. మరిప్పుడు బీజేపీ ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తానంటోందా? అందుకే కలుద్దామనుకుంటున్నారా? 2019 ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోడీని చంద్రబాబునాయుడు ఎంత దారుణంగా తిట్టిపోశారో బీజేపీ నాయకులకు గుర్తుండే ఉంటుంది. రాష్ట్రంలో తన ఐదేళ్ల పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి మోడీ సర్కారు మీదకి నెట్టేసి ఎన్నికలకు వెళ్లారనేది రాజకీయ వర్గాల భావన. 2019లో అధికారం కోల్పోయిన దగ్గర నుంచి చంద్రబాబు బీజేపీ పొత్తు కోసం తహతహలాడుతూనే ఉన్నారు. 2019లో తాను బీజేపీకి దూరం కాకపోయి ఉంటే అధికారం చేజారిపోయేది కాదని బలంగా నమ్మడమే ఇందుకు కారణం కావచ్చు. గమ్మత్తేమిటంటే అదే 2019లో చంద్రబాబు జనసేనకు కూడా దూరం జరిగారు. కానీ, ఇప్పుడు బీజేపీతో కలిసి నడుస్తున్న పవన్ కళ్యాణ్ టీడీపీని కూడా కలుపుకుంటామని చెప్తున్నారు.

### ఆ మూడు కలిస్తే... మాకే లాభం అంటున్న వైసీపీ

టీడీపీ, జనసేన, బీజేపీ కలిస్తే వైసీపీకి మరోసారి అధికారం అప్పగించినట్టేనని సీపీఐ నారాయణ చాలా సార్లు వ్యాఖ్యానించారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన కూడా ఇదేనని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే బీజేపీ వ్యతిరేక మైనారిటీ, బడుగు, బలహీనవర్గాల ఓటు బ్యాంకు వైసీపీకి మళ్లుతుంది. 2019లో టీడీపీ వెనుక బ్రాహ్మణ, క్షత్రియ, కమ్మ, వైశ్య, కాపు, బీసీ, కొంత వరకు రెడ్డి సామాజిక వర్గాలు నిలిచాయి. అధిక శాతం రెడ్డి వర్గీయులతో పాటు మైనారిటీలు, బడుగు బలహీనవర్గాలు వైసీపీని ఆదరించాయి. 2014లో కూడా ఈ రెండు వర్గాల మధ్య ఎన్నికల యుద్ధం జరిగింది. టీడీపీ – బీజేపీ కలిసి బరిలో దిగినప్పటికీ సాధించిన ఓట్లు వైసీపీ కంటే ఒకటిన్నర శాతం మాత్రమే ఎక్కువ.

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ విభజన హామీలు నెరవేర్చి ఉండినా, చంద్రబాబు అమరావతినే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధిపై దృష్టిపెట్టి ఉండినా 2019 నాటికి కూడా బీజేపీ – టీడీపీ పొత్తు బలంగా నిలబడగలిగేది. కానీ, బీజేపీ ఏపీని పట్టించుకోలేదు. దీంతో రాష్ట్రంలో చంద్రబాబు ప్రతిష్ట మసకబారింది. తప్పుడు అంచనాలతో బీజేపీతో గొడవపడి చంద్రబాబు ఘోరంగా నష్టపోయారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ తన వర్గాల్లో బలం పెంచుకుంటూ పోతున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన మూడూ కలిసినా జగన్ ఓటు బ్యాంకును కొల్లగొట్టగలవా? అన్నది ఇప్పటికైతే ప్రశ్నార్థకమే. తటస్థుల ఓట్లు ఎటువైపు పడితే ఆ పార్టీ లేదా ఆ కూటమి నెగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయన్నది రాజకీయ వర్గాల విశ్లేషణ. వైసీపీ శ్రేణులు మాత్రం ఆ మూడూ ఒకటైతే మాకే లాభం అని బహిరంగంగానే చెప్తున్నాయి.

### బీజేపీ రాకపోయినా... టీడీపీతోనే పవన్

వ్యక్తిగతంగా కూడా చంద్రబాబుపై మోడీ ఆగ్రహంగా ఉన్నారు. గోద్రా ఘటన అనంతరం ఘటనలే కాకుండా, 2019 ఎన్నికలకు ముందు బాబు మోడీపై వ్యక్తిగతంగా విరుచుకుపడడం దీనికి కారణం. అందుకే టీడీపీ ఎంత పాకులాడినా, పవన్ ద్వారా రాయబారాలు పంపినా బీజేపీ కరగడంలేదు. పైగా టీడీపీతో వెళ్లకు, ఓపిక పట్టు అని పవన్‌ను సముదాయిస్తున్నారు. పవన్‌ది స్వల్పకాలిక వ్యూహం. ఈసారి ఎలాగైనా అసెంబ్లీకి తనూ, తనతో పాటు మరికొందరు జనసేన ఎమ్మెల్యేలను తీసుకెళ్లాలి. 2019 ఎన్నికల్లో కనీసం 1 శాతం ఓట్లు కూడా రాని బీజేపీని నమ్ముకుంటే అది సాధ్యపడదు. టీడీపీతో పొత్తు పెట్టుకుని ఓ పది సీట్లైనా గెలిస్తే, పరువు దక్కించుకోవచ్చన్నది జనసేనాని ఆలోచనగా రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీనే పట్టుకుని వేలాడితే ఏపీకేమీ చేయలేదన్న కోపంతో ఆంధ్రులు కాషాయపార్టీని ఆదరించకపోతే, ఆ ప్రభావం తన పార్టీపై కూడా పడుతుందని పవన్ ఆలోచనగా భావిస్తున్నారు. ఈసారి పవన్ కొన్ని సీట్లైనా తప్పక గెలవాలి లేదంటే చాప చుట్టేయాల్సిందే...! అందుకే బీజేపీ కంటే టీడీపీ వైపే ఎక్కువ మొగ్గుచూపుతున్నారు.

### పొత్తు నష్టమా? లాభమా?

పార్టీ చరిత్రలో కనీవినీ ఎరగనంత ఘోరంగా 2019లో ఓడిపోవడంతో టీడీపీ చతికిలపడింది. క్యాడర్, నాయకులు అంతా చప్పబడిపోయారు. బీజేపీతో వైరం పెట్టుకుని నష్టపోయిన తర్వాత జగన్ చర్యల నుంచి తనను, తన కేడర్‌ను కాపాడుకోవడానికి మోడీని చల్లబరిచే ప్రయత్నంలో జాతీయ స్థాయిలో ఇతర ప్రతిపక్షాలకు కూడా బాబు దూరమయ్యారు. బీజేపీతో పొత్తు పెట్టుకుంటే లాభమా? నష్టమా అన్న చర్చ టీడీపీలో కూడా జరుగుతోంది. ముస్లిం జనాభా గణనీయంగా ఉన్న రాయలసీమ టీడీపీ నేతలు పొత్తు వద్దంటున్నారు. కానీ, బీజేపీతో పొత్తు అన్నది తమ భవిష్యత్ వ్యూహంగా భావిస్తూ తెలుగుదేశం పార్టీ రైల్వేజోన్, ప్రత్యేకహోదా, స్టీల్‌ప్లాంట్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరల పెంపు లాంటి తప్పిదాలు అన్నింటినీ జగన్ పార్టీ మీద నెట్టేస్తోంది. జగన్ చేతకానితనం వల్లే ప్రత్యేకహోదా, రైల్వే జోన్ రావడం లేదని టీడీపీ ఎప్పట్నుంచో ప్రచారం చేస్తోంది. కేంద్రం చేయని పనులకి కూడా వైసీపీనే తప్పుబడుతున్నారు. 2014లో దేశవ్యాప్తంగా మోడీ మేనియా ఉన్నప్పుడు టీడీపీ లాభపడింది. 2019 నాటికి ఆ క్రేజ్ మరింత పెరిగింది. 2024 నాటికి మోడీ చరిష్మా అంతగా పెరగకపోయినా పెద్దగా తగ్గలేదు. ఇది తనకు లాభమే కదా అన్నది చంద్రబాబు ఆలోచనగా రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో జగన్ ఐదేళ్ల పాలన పూర్తయ్యే నాటికి ఎవరు అధికారంలో వున్నా సహజంగా ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకత వల్ల కొంత నష్టం జరగొచ్చు. దాంతో పాటు 22 మంది ఎంపీలనిచ్చినా, హోదా తేలేకపోయారన్న నిరాశ వల్ల ఈసారి ఆంధ్ర ఓటరు, అసెంబ్లీ ఓటు ఎవరికి వేసినా లోక్‌సభ ఓటు మాత్రం మోడీకి వేసే అవకాశం లేకపోలేదు. అది తనకు లాభిస్తుందన్నది చంద్రబాబు ఆశగా భావిస్తున్నారు. ఈసారి పొత్తు కుదురుతుందా? కుదిరితే అది ఎవరికి లాభం, ఎవరికి నష్టమో.. వేచి చూడాల్సిందే..!

## శంకరమఠంలో చండీహోమం

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ఆగస్టు 31న నెల్లూరు మూలాపేటలోని శంకరమఠంలో కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. పంచాగ్నుల పవన్‌కుమార్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించగా, మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి పర్యవేక్షించారు.

# సెప్టెంబర్ 2 : తెలుగు రాష్ట్రం దుర్మరణం పాలైన రోజు...

## మరపురాని ఆ చిరునవ్వు... పంచె కట్టు!

అవి 1991 నాటి రోజులు. కడప కాంగ్రెస్ ఎం.పీ డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తూర్పుగోదావరి జిల్లాకు పర్యటనకు వస్తున్నారు అని తెలిసింది. ఆయన పర్యటన అంటే చాలు. ఏ జిల్లాకు ఆ జిల్లాలో కాంగ్రెస్ యువకులు బిలబిలమంటూ ఆయనను చుట్టుముట్టేసి... ఆయనను ఫాలో అవుతుండేవారు.

తూర్పుగోదావరి జిల్లా అంటే ఆయన దృష్టిలో.... రాజమండ్రే. అభిమాన అనుచరులూ... అంటే, జక్కంపూడి రామ్మోహనరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్. ఆ తరువాతి వరుసలోనే వట్టి వసంతకుమార్, పల్లంరాజు, శ్రీకాకొళపు శివసుబ్రహ్మణ్యం వస్తారు.

1991లో ఓసారి కాకినాడ సమీపంలో ఏదో కార్యక్రమానికి వస్తున్నట్టు తెలిసింది. ఆ సమయంలో నేను కాకినాడలో 'ఆంధ్రభూమి' రిపోర్టర్‌గా ఉన్నాను. జక్కంపూడి రామ్మోహన్‌రావుకు ఫోన్‌చేసి, వై.ఎస్.తో 'మీట్ ది ప్రెస్' పెడతాను, కాకినాడ తీసుకురావాలి అని కోరాను. 'జక్కంపూడి' అంటే... పొగరుమోతు పోట్లగిత్త. ఒక్క వై.ఎస్.ను తప్ప ఎవరినీ కేర్ చేసే రకం కాదు.

జక్కంపూడి దంపతులు ఉండేది రాజమండ్రి అయినా, నేను ఉండేది కాకినాడలో అయినా... నా పట్ల అపారమైన ప్రేమాభిమానాలతో ఉండేవారు. నా స్థాయికి మించిన ప్రేమాభిమానాలు.

నేను అడిగేవరకు వై.ఎస్.కు ఆ పర్యటనలో కాకినాడ లేదు. నేను అడగగానే, వెంటనే ఓకే చెప్పి, ఉదయం 10 గంటలు అని టైమ్ కూడా ఇచ్చేశారు.

జక్కంపూడి ఓకే చెప్పగానే, నాకు దడ వచ్చేసింది. అడగడం అయితే అడిగాము గానీ, వై.ఎస్.ను హ్యాండిల్ చేయగలమా? ఆయన స్థాయికి తగిన హాల్ ఎక్కడ ఉంది? వంటి ప్రశ్నలతో మా జర్నలిస్టుల బుర్రలు హీటెక్కిపోయాయి.

ఠప్‌మని జిల్లా పరిషత్ సమావేశ మందిరం గుర్తుకు వచ్చింది. అంతకుముందే, మూడు కోట్లతో ఆ హాల్‌ను అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు, బాగా డబ్బున్న వారి ఇంట్లో పెళ్లి కూతురుని ముస్తాబు చేసినట్టు.

జీ.ఎం.సీ.బాలయోగి జడ్పీ ఛైర్మెన్. తెలుగుదేశం పార్టీ నాయకుడు. వై.ఎస్సేమో కాంగ్రెస్ ఎం.పీ.

నా పట్ల ఎంత ప్రేమగా... గౌరవంగా... అభిమానంగా బాలయోగి వ్యవహరించేవారో ఇప్పుడు తలుచుకున్నా, రాయాల్సి వచ్చినా కళ్ళల్లో నీళ్లు తిరుగుతాయి. ఆయనను అడిగాను, వై.ఎస్. గారితో సమావేశానికి సమావేశ మందిరం... ఓ రెండు గంటలు కావాలి అని.

ప్రైవేట్ సమావేశాలకు ఈ సమావేశ మందిరాన్ని ఇవ్వగూడదని జడ్పీ తీర్మానం ఉన్నప్పటికీ, ఆయన వెంటనే ఇచ్చారు.

నేను తూర్పుగోదావరి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్‌కు అధ్యక్షుడిని కూడా అయినందున, జిల్లా వ్యాప్తంగా అన్ని పత్రికల విలేకరులను ఈ 'మీట్ ది ప్రెస్'కు ఆహ్వానించాము. వారంతా నా పట్ల నా ఊహకు అందనంత అభిమానంతో ఉండేవారు.

హాల్ నిండిపోయింది.

సరిగ్గా సమయానికి వై.ఎస్. బృందం వచ్చేసింది. 'నిత్య అసమ్మతివాది'గా ముద్రపడిపోయిన వై.ఎస్, జక్కంపూడి దిగారు. పుష్పగుచ్ఛం చేతికి అందించి, పరిచయం చేసుకున్నాను. నన్ను జక్కంపూడి ఎంతో ఘనంగా వై.ఎస్.కు పరిచయం చేశారు. ఆ చిరునవ్వు, పంచెకట్టులో ఏదో కనికట్టు ఉన్నదనిపించింది. కాంగ్రెస్ యువ అభిమానుల కోలాహలం మధ్య ఆయనను హాల్‌లోకి తీసుకువెళ్లాను.

వేదికపై నేను, వై.ఎస్.గారే. ఆడియన్స్‌లో జక్కంపూడి రామ్మోహనరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, పల్లంరాజు, శివ సుబ్రహ్మణ్యం, వట్టి వసంతకుమార్ వగైరాలు.

కాంగ్రెస్‌ను రాష్ట్రంలో పటిష్టం చేయడం గురించి ఆయన మాట్లాడారు.

ఇక, చివరగా... 'మీరు నిత్య అసమ్మతి వాది అనే ముద్ర పడింది కదా! మీ తదుపరి కార్యక్రమం ఏమిటి?' అని అడిగాను.

'ఏముందీ! జనార్ధనరెడ్డిని దింపడమే...' అంటూ హాయిగా... పెద్దగా... గలగలా నవ్వుతూ కుర్చీలోంచి పైకిలేచారు. హాల్‌లో ఒక్కసారి చప్పట్లు మారుమోగిపోయాయి.

నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రిత్వంపై డాక్టర్ వై.ఎస్. తిరుగుబాటు జెండా ఎగరేసింది కాకినాడలోనే. నేను, ఆయన మాత్రమే వేదికపై ఉన్న 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలోనే.

ఆ తరువాత, ముఖ్యమంత్రి కావడానికి ఆయన మరో పదమూడేళ్లు ఆగాల్సి వచ్చింది. 2004 అసెంబ్లీ ఎన్నికలకు ముందు... ఆయన రాష్ట్రంలో పాదయాత్ర ప్రారంభించారు, చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు.

ఆ సమయంలో నేను హైదరాబాద్‌లో 'ఆంధ్రప్రభ' స్పెషల్ కరెస్పాండెంట్‌గా ఉన్నాను. ఏబీకే ప్రసాద్ గారు ఎడిటర్. నేను అంతకుముందే ఉదయం దినపత్రికలో ఆయన సంపాదకత్వంలో పనిచేసి ఉండడం వల్ల... ఒక వాక్యం కలపడమో..., తీసి వేయడమో ఉండేది కాదు.

వై.ఎస్. పాదయాత్రను ఆంధ్రప్రభ వరకు నేనే కవర్ చేసేవాడిని. ఏబీకే అంటే... బైలైన్లే. అంటే, ఐటమ్‌కు రిపోర్టర్ పేరు ఉండేది, కొంచెం బాగుంటే. ప్రతిరోజూ నా బైలైన్‌తో పాదయాత్ర కథనాలు వచ్చేవి.

ఒకరోజు ఆఫీసులో ఉండగా ఉన్నట్టుండి ఒక ఫోన్ వచ్చింది. నేను కావాలి అని అవతలి వారు అడిగారు.

నేను లైన్‌లోకి వచ్చి, ఎవరు అని అడిగాను.

'రాయుడు గారా? నేను కేవీపీ రామచంద్రరావు. బాగున్నారా? మీ స్టోరీలు చూస్తున్నా. వై.ఎస్. ముఖ్యమంత్రి కావాలనే కోరిక మీ కథనాల్లో కనపడుతోంది. సంతోషం. ఆ విషయం మీకు చెబుదామని ఫోన్ చేశా." అని అన్నారు. కేవీపీ గారు నాకు మొదటిసారి ఫోన్‌చేసి 32 ఏళ్ళు అయింది. ఇప్పటికీ, ఆయన పట్ల అదే గౌరవం.

ట్రింగ్... ట్రింగ్.... ట్రింగ్....

2004 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది.

వై.ఎస్ పట్ల సగం పాజిటివ్ ఓటు, చంద్రబాబు పట్ల సగం నెగెటివ్ ఓటు కలిసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

వై.ఎస్ ముఖ్యమంత్రి అయ్యారు. పాతిక సంవత్సరాల ఆయన అభిమానుల కల నెరవేరింది.

ఆయన చేపట్టిన "జలయజ్ఞం" ప్రాజెక్ట్ కింద రాష్ట్రంలోని 20 జిల్లాలలో గల 26 పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడం ఒక యజ్ఞంలాగా చేపట్టారు. ఇందుకోసం, నీటి పారుదల శాఖకు ముగ్గురు కార్యదర్శులను నియమించారు. సతీష్‌చంద్ర, రాజీవ్ రంజన్ మిశ్రా, ఆదిత్యనాథ్ దాస్ ఆ ముగ్గురు కార్యదర్శులు. వీరిపై, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఎంజీవీకే భాను. ప్రతి వారం వై.ఎస్ స్థాయిలో రివ్యూ.






2006 నాటికి జలయజ్ఞం పనులు ఊపందుకున్నాయి.

సతీష్‌చంద్ర కాకినాడకు కలెక్టర్‌గా ఉన్న సమయంలో నాకు బాగా పరిచయం. ఆయనకూ రాత్రిళ్ళు రెండింటి వరకు నిద్ర పట్టేది కాదు. నాకూ అంతే. అందుకే, ఇద్దరికీ కుదిరింది.

అర్ధరాత్రి దాటాక, కలెక్టర్ బంగళా గార్డెన్‌లో బెంచీల మీద కూర్చుని బాతాఖానీ కొట్టేవాళ్ళం. మధ్యమధ్యలో యానాం ఎంఎల్‌ఏ మల్లాడి కృష్ణారావు వచ్చి కలిసేవాడు.

ఆ సతీష్‌చంద్ర ఇప్పుడు నీటిపారుదల శాఖకు ముఖ్యకార్యదర్శి కదా... ఎలా పనులు జరుగుతున్నాయో అడుగుదామని సతీష్ చంద్ర ఇంటికి వెళ్లాను.

"వై.ఎస్. గారు చిత్తశుద్ధితో జలయజ్ఞం చేస్తున్నారు రాయుడు. ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. ఇంతమంది ఆఫీసర్లు, ఇంజనీర్లు దానిమీద పని చేస్తున్నారు. కానీ, ప్రెస్‌లో ఒక్క వాక్యం రావడం లేదు. చాలా అన్యాయం అనిపిస్తోంది. నువ్వు ఒక ఆర్టికిల్ రాయగూడదా?" అన్నారు.

"ఇంత పెద్ద ప్రాజెక్ట్ గురించి, మీ ఆఫీసర్లు చెబితే చెవితో విని రాయలేను సర్. 26 ప్రాజెక్ట్‌లను కంటితో చూస్తేనే... రాయగలను" అన్నాను.

"20 జిల్లాలు తిరగాలి. అయ్యేపనేనా?" అన్నారు.

"వై.ఎస్ మీద అభిమానమే తిరిగేటట్టు చేస్తుంది. తిరుగుతాను." అన్నాను.

"మీకు ఏమి కావాలో చెప్పండి. గవర్నమెంట్ నుంచి శాంక్షన్ చేస్తా" అని సతీష్‌చంద్ర అన్నారు.

"ఒక్క రూపాయి అవసరం లేదు. వెళ్లినచోట వసతి, కాస్త తిండి. ప్రాజెక్ట్ చూపించి, ఎక్స్‌ప్లయిన్ చేసే ఇంజినీరు ఉంటే చాలు..." అన్నాను.



ఒక క్యాబ్ (ఇండికా), ఒక ఫోటోగ్రాఫర్ మిత్రుడిని తీసుకున్నాను. నెల రోజుల వరకు రానని ఇంట్లో చెప్పాను. 26 ప్రాజెక్ట్‌లు 22 రోజుల్లో తిరిగాను. పగలు ప్రాజెక్ట్ విజిట్. రాత్రి నోట్స్ రాసుకోవడం. ఏరోజుకు ఆరోజు హైదరాబాద్ సచివాలయం కార్యదర్శుల ఆఫీస్‌ల నుంచి మరుసటి రోజు విజిట్‌కు సంబంధించిన ప్రాజెక్ట్ అధికారులకు మెసేజ్‌లు. ప్రాజెక్ట్ వివరాలు వివరంగా చెప్పాలి అని.

నెల రోజుల తరువాతే, హైదరాబాద్ తిరిగి వచ్చాను.

ఫోటోలు, నా స్క్రిప్ట్‌తో ఒక డమ్మీ సంచిక రూపొందించా.

దానిని తీసుకెళ్లి ముఖ్యకార్యదర్శిగా ఉన్న సతీష్ చంద్రకు చూపించా.

ఆయన షాక్. "రాత్రికి సీఎం గారికి పంపిస్తా" అని తీసుకున్నారు.

మరుసటి రోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో మా ఇంట్లో నా మొబైల్ మోగింది.

"హలో! రాయుడు గారా? క్యాంపు ఆఫీసు నుంచి. సీఎం గారు మాట్లాడతారు. కలుపుతున్నా..." అంటూ ఒక గొంతు.

బిగుసుకుపోయా. షాక్‌లోకి వెళ్ళా.

"రాయుడూ... బాగున్నావా? ఏం అద్భుతంగా రాశావయ్యా జలయజ్ఞం బుక్కు. ఆ నలభయ్యో పేజీలో ఫోటో, అరవై రెండో పేజీలో రిపీట్ అయింది చూశావా...? గవర్నమెంట్ నుంచి రూపాయి కూడా తీసుకోలేదటగా... ఎలా వీలైంది... తిరగడం?..." అంటూ ఆయన మాట్లాడుతుంటే... "సర్... సర్... సర్..."" అనడమే తప్ప మాటలు రాలేదు.

"సర్, దీనికి ముందు మాట మీరు రాయాలి." అని మాత్రం అనగలిగాను.

"తప్పకుండా. రేపు ఉదయం నాలుగున్నరకు క్యాంపు ఆఫీసుకు రా..." అన్నారు.

ఒక చిన్న టేప్‌రికార్డర్ కొనుక్కుని మరుసటిరోజు తెల్లవారుఝామున నాలుగు గంటలకు క్యాంపు ఆఫీసుకు వెళ్లాను.

తెల్లని లుంగీ పంచె, ఓ కాటన్ చేతుల బనీనుతో.... ఎనిమిది కోట్ల ఆంధ్రుల ముఖ్యమంత్రి... నా ముందు ప్రత్యక్షం.

వస్తూనే... ఆయన చేతుల్లో నేను రాసిన జలయజ్ఞం సంచిక. దాని గురించి ఎంత గొప్పగానో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయీ తీసుకోకుండా అన్ని ప్రాజెక్టులు కేవలం నెలలో తిరిగి ఆ పుస్తకం రాయడం ఆయనను అబ్బురపరిచింది.

"ముందు మాట సర్..." అని నసిగాను.

టేప్ రికార్డర్ ఆన్ చేశాను. (అంతకు ముందు 20ఏళ్ళ క్రితం ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రిగా 1987లో ఇంటర్వ్యూ చేసినప్పుడు కూడా టేప్ రికార్డరే వాడాను)



ఆయన ఫస్ట్ పర్సన్‌లో ఈ బుక్‌కు చెప్పిన విషయాలు ఏకంగా రెండు పేజీలు వచ్చాయి.

అవి కంపోజ్ చేసి తీసుకెళ్లా. చదివి, అడుగున సంతకం చేసి, good అని రాశారు.

"మీరు ఈ ప్రత్యేక సంచికను లాంచ్ చెయ్యాలి సర్" అని అడిగాను.

అప్పుడు సమయం ఉదయం 5 గంటలు.

వెంటనే, తన కార్యదర్శి ఎంజీవీకే భానుకు ఫోన్ చేశారు.

"భానూ, రాయుడు జలయజ్ఞం మీద అద్భుతమైన బుక్ రాశాడు. జూబిలీ హాల్‌లో గవర్నమెంట్ ఫంక్షన్‌లా బుక్ రిలీజ్ ఏర్పాటు చెయ్యి. మినిస్టర్స్ అందరూ అటెండ్ అవ్వాలి. ఇరిగేషన్ సీఈలు అందరూ అటెండ్ అవ్వమను. రాయుడుతో డిస్కస్ చేసి, డేట్ ఫిక్స్ చెయ్యి..." అని వై.ఎస్. ఆదేశాలు జారీ చేశారు.

ఈ డెవలప్‌మెంట్ చెబుదామని కేవీపీ రామచంద్రరావు దగ్గరకు వెళితే, ఏమి జరిగిందో... ఆయనే నాకు చెప్పారు. ఆశ్చర్యంతో నోరు తెరిచా.

ఆయన మరణం... ఒక మామూలు మరణం కాదు. అది తెలుగుజాతిగా ఒక రాష్ట్ర మరణం. రాష్ట్ర రాజకీయాలలో ఆత్మీయతకు మరణం. తెలుగువారి చరిత్రను, రాజకీయ నడకను ముళ్ల పొదల్లోకి మలుపు తిప్పిన మరణం.

ఈ సెప్టెంబర్ 2న మన తెలుగు రాష్ట్ర చిరునవ్వు, తెలుగుతనం... పావురాల గుట్టలో అమరులైన వేళ.... ఆ చిరంజీవికి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

(ఆయుష్షు ఉన్నంత వరకు ఆ మహా మనిషితో ఒక్కో ఏడాది ఒక్కో అనుభవం జ్ఞాపకం చేసుకుందాం)

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com



# 'చంద్రయాన్' సక్సెస్.. ఇక 'సూర్యాన్'

(మొదటి పేజీ తరువాయి)

గతనెల.. అంటే ఆగస్టు 23వ తేదీన చందమామ దక్షిణ ధ్రువంపై ఇస్రో పంపిన ల్యాండర్ సురక్షితంగా దిగి, అందులో ఉన్న ప్రజ్ఞాన్ రోవర్ ద్వారా చంద్రునిపై ఉన్న ఆసక్తికరమైన విశేషాలను, ఛాయాచిత్రాలను భూమికి చేరవేస్తున్న నేపథ్యంలో, శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్‌కేంద్రం) నుంచి పిఎస్ఎల్‌వి-సి57 రాకెట్ ద్వారా సూర్యయాన్ ప్రయోగానికి కూడా ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సెప్టెంబరు 2వతేదీ ఉదయం 11.50 గంటలకు అందుకు సుముహూర్తంగా నిర్ణయించారు. షార్‌లోని రెండవ ప్రయోగవేదికపై రాకెట్ అనుసంధానం పనులు పూర్తయ్యాయి.

ఈ రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకు వెళ్ళనున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని బెంగుళూరులోని యుఆర్ రావు శాటిలైట్ కేంద్రం నుంచి షార్‌కు తీసుకొనివచ్చి ఈ ప్రయోగానికి అవసరమైన అన్ని కీలకమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. సౌర తుఫాన్ల సమయంలో వెలువడే రేణువులతో భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, అందుకు సంబంధించిన సమాచారం కోసం శాస్త్రవేత్తలు ఈ ప్రయోగం ద్వారా తమ అన్వేషణ ప్రారంభించనున్నారు. సుమారు 1475 కేజీల బరువున్న ఈ ఉపగ్రహాన్ని సునాయాసంగా భూమి నుంచి రోదసిలోకి మోసుకునిపోయేందుకు బాహుబలి సీరీస్ రాకెట్ పిఎస్ఎల్‌వి-సి57 సిద్ధంగా ఉంది.

## ప్రయోగం ఇలా ఉంటుంది

పిఎస్ఎల్‌వి-సి57 రాకెట్ నింగిలోకి దూసుకువెళ్ళిన తర్వాత, ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. అక్కడి నుంచి భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాగ్రేంజియన్ పాయింట్-1(ఎల్-1)లోకి ఉపగ్రహాన్ని పంపడానికి 177 రోజుల సమయం పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అక్కడినుంచి ఆదిత్య ఎల్-1 ఉపగ్రహం తన పరిశోధనలను ప్రారంభిస్తుంది. సూర్యుని గుట్టుమట్లను తెలుసుకోవడంతో పాటు, వివిధ గ్రహాల శోధనకు, విశ్వంలోని అనేక రహస్యాలను కనుగొనేందుకు, ముఖ్యంగా సౌరగోళంలో ఏర్పడుతున్న గాలులు, జ్వాలలపై పరిశోధనలు చేసేందుకు మన శాస్త్రవేత్తలు ఆదిత్య-ఎల్1ని ప్రయోగిస్తున్నారు. చంద్రయాన్ లాగానే సూర్యయాన్ అద్భుతాలు సృష్టిస్తుందని, ఇదొక అద్వితీయ ప్రయోగంగా రూపుదాలుస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఈ ప్రయోగం కూడా నూటికి నూరు శాతం విజయవంతమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఒకే వేదికపై ఎన్.టి.ఆర్ కుటుంబం



ఎన్.టి.ఆర్ శత జయంతి స్మారకంగా ఇటీవల ఢిల్లీలో 100 రూపాయల నాణెంను విడుదల చేసిన సందర్భంగా ఎన్.టి.ఆర్ కుటుంబసభ్యులతో భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

## ఆత్మీయ అభినందనలు



ఆగస్టు 31వ తేదీ గురువారం తిరుమలలో టి.టి.డి బోర్డు సభ్యునిగా ప్రమాణస్వీకారం చేసిన గాదిరాజు వెంకటసుబ్బరాజుకు ఆత్మీయ అభినందనలు తెలియజేస్తున్న శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, టి.టి.డి మెడికల్ అడ్వైజర్ డాక్టర్ శ్వేత తదితరులు.

# సంఘటిత కృషితోనే దేశ పురోగతి

## • 'నా దేశం-నా భూమి'లో వక్తలు

అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాకారం చేసుకునే దిశగా ప్రజలందరూ సంఘటితంగా కృషి చేయాలని, అన్ని చేతులు కలిస్తేనే ఆత్మనిర్భరతతో కూడిన అభివృద్ధి భారతం సాధ్యమౌతుందని, ఐక్యత..సంఘటిత కృషితోనే దేశపురోగతికి బాటలు వేసుకోవాలని 'మేరీ మిట్టీ- మేరా దేశ్ (నా భూమి-నా దేశం) కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాల ముగింపును పురస్కరించుకుని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం-నెల్లూరు వారి ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి నిర్ధేశకత్వంలో తిరుపతి జిల్లా నాయుడుపేట రూరల్‌మండలం పూడేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 31 గురువారం నాడు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శాంతమ్మ, మండల పరిషత్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ దీపిక, భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, విద్యాధికారి శివప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






జననం: 01.07.1930

మరణం: 03.09.2016

## 7వ వర్ధంతి

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

**గునుపాటి ఆదిశేషారెడ్డి గారు**

పరమపదించి తేది.03.09.2023 నాటికి
ఏడేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు
**గునుపాటి మురళీకృష్ణారెడ్డి**
మరియు
**కుటుంబసభ్యులు**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com